



పెనుమాకలో పింఛన్ దారు పాముల నాయక్‌కు ఇళ్ల పట్టా అందజేస్తున్న సీఎం చంద్రబాబు



చిలకలూరిపేటలో పుల్లారావు పంపిణీ



పిడుగురాళ్ళలో యరపతినేని, జంగా



శావల్యాపురంలో జీవీ ఆంజనేయులు



మాచర్లలో బ్రహ్మారెడ్డి



అల్లూరివారిపాలెంలో అరవిందబాబు, కలెక్టర్



పెదకూరపాడులో భాష్యం ప్రవీణ్



సత్తెనపల్లిలో కన్నా నాగరాజు

పల్నాడు జిల్లాలో 93.36 శాతం పంపిణీ

పల్నాడు జిల్లా పింఛన్ల పంపిణీలో ఒకడుగు వెనుకవుంది. సంఖ్యా పరంగా లబ్ధిదారులు ఎక్కువగా ఉండడం, మారుమూల లోతట్టు ప్రాంతాలు ఉండడంతో పింఛను పంపిణీలో కొంత జాప్యం జరిగింది. ఆ జిల్లాలో 2,79,975 మందికిగానూ 2,45,847 మందికి పింఛను అంద జేశారు. రూ. 190.09 కోట్లకుగానూ రూ. 178.71 కోట్లు లబ్ధిదారులకు అందజేశారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 492.76 కోట్ల రూపాయలు తొలిరోజు అందజేశారు.

వలంటీర్లు.. లేకున్నా..

- సచివాలయ సిబ్బందితోనే పూర్తి స్థాయిలో పింఛన్ల పంపిణీ
- సాయంత్రం 6 గంటలకు 90 శాతం పంపిణీ పూర్తి
- సర్వర్ సమస్య తలెత్తినా వేగం తగ్గకుండా ముందుకు
- తొలిరోజే 469 కోట్ల రూపాయల అందజేత
- చేసి చూపించిన కూటమి ప్రభుత్వం

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం తొలిరోజు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. జిల్లాలోని ప్రతి ఒక్క పింఛనుదారుకు తొలిరోజే పెంచిన పింఛన్లు అందజేయాలన్న టార్గెట్‌ను ప్రభుత్వం దాదాపుగా పూర్తి చేసింది. సోమవారం మధ్యాహ్నం సర్వర్ సమస్య తలెత్తినప్పటికీ పింఛన్ల పంపిణీలో జాప్యం జరగకుండా సచివాలయ సిబ్బంది జాగ్రత్త పడ్డారు. అనుకున్న విధంగా సాయంత్రం ఆరు గంటలకల్లా బాపట్ల గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 90 శాతం మందికి పింఛన్లు అందజేసి తమ సత్తా ఏంటో సచివాలయ ఉద్యోగులు చూపించారు.

● గత ప్రభుత్వ నిర్వాకంతో 33 మంది బలి

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే, ఆ నెపం ప్రతిపక్షాలపై నెట్టేందుకు గత ప్రభుత్వం కుట్రలు చేసింది. సచివాలయ సిబ్బందితో ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు పంపిణీ చేయవచ్చని ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీలు ఎంత మొత్తుకున్నా లబ్ధిదారులను సచివాలయాలకు రప్పించి ఎండలో నిలబెట్టారు. బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఫలితంగా ఏప్రిల్ నెలలో 33 మంది వృద్ధులు అన్యాయంగా చనిపోయారు. ఆ నేరాన్ని ప్రతిపక్షాలకు ఆపాదించాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ ప్రజలు వాటిని నమ్మలేదు. కూటమి ప్రభుత్వానికే పట్టం కట్టారు. తాము అధికారంలోకి వచ్చాక వలంటీర్ల సహాయం లేకపోయినా పింఛన్లు పంపిణీ చేయొచ్చని కూటమి ప్రభుత్వం చెప్పడమే కాకుండా, చేసి చూపించింది. తొలి రోజు సాయంత్రం 6 గంటలకల్లా రాష్ట్రంలోని 92 శాతం మంది లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

● బాపట్ల జిల్లాలో 94.75 శాతం పూర్తి

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో బాపట్ల జిల్లా పింఛన్ల పంపిణీలో ముందడుగులో ఉంది. ఆ జిల్లాలో 2,33,102 మంది లబ్ధిదారులు వుండగా వారిలో 1,13,547 మందికి, అంటే 94.75 శాతం మందికి తొలిరోజే ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన నగదు రూ. 157.11 కోట్లకుగానూ, 148.92 కోట్లు అందజేశారు.

● గుంటూరు జిల్లాలో 95.17 శాతం పంపిణీ

విభజిత గుంటూరు జిల్లాలో మొత్తం 2,58,786 మంది పింఛనుదారులు వుండగా వారిలో 95.17 శాతం మందికి, అంటే 2,34,367 మందికి సాయంత్రం 6 గంటలలోపు పింఛను అందజేశారు. వారికి రూ. 173.29 కోట్లకుగానూ రూ. 165.15 కోట్లు అందజేశారు.




మంగళగిరి వేదిక కావడం సంతోషం : లోకేశ్

రాష్ట్ర ప్రభుత్వ తొలి కార్యక్రమానికి మంగళగిరి వేదిక కావడం ఆనందంగా ఉందని మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ఆనందం వ్యక్తం చేశారు. పెనుమాకలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1985 తర్వాత మంగళగిరిలో టీడీపీ గెలవలేదని, 2019లో 5,300 ఓట్ల తేడాతో నేను ఓడిపోయానని, ఐదు సంవత్సరాల్లో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువయ్యానని ఆయన అన్నారు. పోయినసారి తగ్గిన ఓట్ల సంఖ్యకు పక్కన మరో సున్నా చేర్చి 53,000 ఓట్ల మెజారిటీ ఇస్తారని ఎన్నికలకు ముందే తాను చెప్పానన్నారు. కానీ తాను ఊహించినదానికన్నా 91 వేల ఓట్ల మెజారిటీతో ప్రజలు తనను దీవించారన్నారు. నియోజకవర్గంలో చాలా సమస్యలు వున్నాయి. రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు ఉన్నాయని, మూడు నాలుగు దశాబ్దాలుగా కొండపోరంబోకులో ఇళ్లు కట్టుకుని నివాసం వుంటున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి వుందని చెప్పారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం కావాలని సీఎంను లోకేశ్ కోరారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం తన నియోజకవర్గం మంగళగిరిలో తీసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తామంతా చంద్రబాబు వెంటే వుంటామని, అమరావతి నిర్మాణం, సీడ్ యాక్సిస్ రోడ్డు అభివృద్ధిలో తామంతా బాబు తోడుంటామని చెప్పారు. అమరావతి నిర్మాణంలో భాగస్వాములవుతామని నియోజకవర్గ ప్రజల తరుపున ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు తమ్మిశెట్టి జానకీదేవి, నందం అబద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

- అధికారంలోకి వచ్చిన 26 రోజుల్లో హామీ అమలు
- పింఛన్ తీసుకు వచ్చింది అన్న ఎన్టీఆర్
- పెంచిన పింఛన్లలో నా వాటానే ఎక్కువ
- రూ. 4 వేలల్లో నా వాటా పెంపు అక్షరాలా రూ. 2,840
- వలంటీర్లు వద్దన్నారని 33 మందిని బలి తీసుకున్న గత ప్రభుత్వం
- సచివాలయ సిబ్బందితోనే పంపిణీ చేయగలమని నిరూపిస్తాం
- మేం మీకు సేవకులమే.. పెత్తందారులం కాదు
- ఒక్క జిల్లాలో రూ. 111 కోట్లు పింఛను ఇచ్చిన ఘనత ఎన్డీఏదే !
- రాష్ట్రంలో ప్రతి 9 మందిలో ఒకరికి పింఛను
- పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

పేదింట.. పింఛన్ పండుగ



పాముల నాయక్ ఇంట్లో టీ తాగుతున్న సీఎం చంద్రబాబు

గుంటూరు, మంగళగిరి,తాడేపల్లి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): 'పెన్షన్ పండుగకు నేనొచ్చా. అధికారంలోకి వచ్చిన 26 రోజుల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛను పెంచి మీకు అందించడానికి వచ్చా. అదే ప్రజా సంక్షేమం పట్ల టీడీపీ, ఎన్డీయేకు వున్న చిత్త శుద్ధి. రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మందికి ఒక్క నెల లో 4,408 కోట్ల రూపాయలు పింఛన్ల ద్వారా అందిస్తున్నాం. అదే ఏడాదికైతే రూ.33,100 కోట్లు, ఐదేళ్లకు రూ. లక్షా 65వేల 500 కోట్ల రూపాయలు పేదలకు ఎన్డీయే ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ అందించబోతోంది. రాష్ట్రంలో ప్రతి 9 మందిలో ఒకరికి పింఛన్లు అందిస్తున్నా. నాకు ఇంతకంటే ఆనందమైన రోజు ఇంకొకటి లేదు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని అందజేయడం భగవంతుడు నాకిచ్చిన అవకాశంగా భావిస్తున్నా' అంటూ ముఖ్యమంత్రి ఉద్వేగానికి గురయ్యారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన మంగళగిరి నియోజకవర్గం పెనుమాక గ్రామంలో లాంఛనంగా ప్రారంభించారు. పెనుమాక గ్రామంలో అత్యంత పేదరికంలో మగ్గిపోతున్న గిరిజన కుటుంబం వద్దకు వెళ్లి సోమవారం ఉదయం ఆరున్నర గంటలకల్లా ఇంటి పెద్ద బనావత్ పాముల నాయక్‌కు వృద్ధాప్య పింఛను, ఆయన భార్య సీతకు సీఆర్డీఏ పింఛను, వితంతువైన

పెనుమాకలో పంపిణీ ప్రారంభించిన సీఎం చంద్రబాబు

ఆయన కూతురు సాయికి వితంతు పింఛను ఆయన చేతుల మీదుగా అందించారు. వారి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇల్లులేని వారికి ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యతను తీసుకున్నారు. ఏడాదిలోపు ఇల్లు కట్టించి ఇస్తానని వారికి హామీ ఇచ్చి, బాధ్యతను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి అప్పగించారు. అనంతరం అక్కడే వారు ఇచ్చిన టీ తాగారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'మీ అందరి దయ, ఆశీస్సులతో నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికై మొట్టమొదటి కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గంలో చేపట్టా. రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గంలో మిమ్మల్ని గౌరవించడానికి, మీకు సేవ చేయడానికే పెనుమాకలో ఈ కార్యక్రమం తీసుకున్నా. మంగళగిరిలాంటి నియోజకవర్గంలో 92 వేల మెజారిటీ రావడమంటే మామూలు విషయం కాదు. అందుకు కారణం ఐదేళ్ల పీడకల! రాష్ట్రాన్ని పట్టి పీడించిన వైనం, కనీసం ఇలా కూర్చుని ప్రశాంతంగా మాట్లాడుకునే పరిస్థితి లేదు. ప్రశాంతంగా పడుకునే పరిస్థితి లేదు. పోలీసులు గోడ దూకి నా ఇంటికి కూడా వచ్చే పరిస్థితి నెలకొంది. అలాంటి భయంకర వాతావరణంలో ఐదేళ్లు బతికాం. ఇప్పుడు అంతా మారిపోయింది. ప్రజా ప్రభుత్వం వచ్చింది. ప్రజల కోసం మేమంతా కష్టపడతాం. సంపద సృష్టిస్తాం. ఆ సంపదను పేదలకు అందజేస్తాం. పేదరికం లేని సమాజాన్ని సృష్టించి మా నిజాయితీని నిరూపించుకుంటాం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. తాను ఎప్పుడూ సేవకుడినేనని, తమ ప్రభుత్వంలో అందరూ ప్రజలకు సేవే చేస్తారని, తామెవ్వరూ పెత్తందారులం కాదని, మీ వద్దకు వచ్చి రచ్చబండ మీద కూర్చుని మీలో ఒకరిగా మీ సమస్యలు విని పరిష్కరించేందుకు కృషి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇందులో ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని మంత్రులైన నారా లోకేశ్, శ్రీనివాసరావులను హెచ్చరించారు.

● పింఛను పెంపులో మూడొంతులు నా వాటానే!

మొట్ట మొదటగా పింఛన్లు ఇచ్చింది అన్న ఎన్టీఆర్. ఆ రోజుల్లోనే ఆయన రూ. 35 పింఛను ఇచ్చారు. 94-95లో దాన్ని నేను 75 రూపాయలకు పెంచాను. ఆ తరువాత 2014 నాటికి ఆ 75 రూపాయలు 200 రూపాయలకు పెంచారు. 2014లో నేను అధికారంలోకి వస్తూనే రూ. 200 పింఛనును రూ. 1000కి పెంచాను. ఆ తరువాత మళ్లీ దాన్ని రూ. 2వేలకు పెంచాను. ఇప్పుడు రూ. 3 వేల పింఛనును 4వేలకు పెంచాను. మొత్తంగా రూ. 4000 పింఛనులో తాను పెంచిన వాటా 2,840 రూపాయలు. పింఛన్ల పెంపు ద్వారా పేదలను ఆదుకోవడంలో తామెప్పుడూ ముందుంటామని చంద్రబాబు చెప్పారు. దివ్యాంగులకు రూ. 6వేలు, తలసీమియా, కిడ్నీ, లివర్, గుండె మార్పిడి బాధితులకు రూ. 10వేలు, సీరియస్ డయాలసిస్, మంచంపట్టినవారికి రూ. 15వేలు పింఛను ఇస్తున్నామన్నారు.

అత్యాచారం చేస్తే అదే ఆఖరిరోజు..

సభికులతో చర్చ నేపథ్యంలో చంద్రబాబు మహిళలకు ధైర్యం కల్పించారు. బాపట్ల జిల్లా ఈపూరుపాలెంలో జరిగిన అత్యాచార ఘటన ప్రస్తావనకు వచ్చిన సందర్భంగా ఆయన మదాంధకారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. 'రాష్ట్రంలో అందరికీ హెచ్చరిక చేస్తున్నా.. ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వచ్చి మదాంధకారంతో విచ్చలవిడిగా ప్రవర్తిస్తే వదిలిపెట్టను. ఎవడైనా అత్యాచారం చేస్తే అదే వాళ్లకు ఆఖరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నా. ప్రభుత్వంతో తమాషాలు ఆడొద్దు. యాంటి సోషల్ ఎలిమెంట్ ఎవరైనా సరే నిర్మొహమాటంగా అణచివేస్తా. మర్యాదగా ఇప్పటి వరకూ చెప్పా. ఎవరైనా కైపెక్కి, లేదా గంజాయి తాగేసి, మద్యం తాగేసి ఇష్టానుసారం చేస్తే తీవ్ర పరిణామాలు వుంటాయి. నాకు అన్యాయం జరిగిందని ఒక ఆడబిడ్డ నా దగ్గరకు వచ్చిందంటే ఎవ్వరినీ వదిలిపెట్టను. అది స్వయంగా మీరే చూస్తారు. మహిళల్లో ధైర్యం కల్పించడం కోసమే దళిత మహిళ అయిన వంగలపూడి అనితను హోమ్ మంత్రిగా చేశానని చెప్పారు.



పెనుమాకలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన ప్రజలు



అవ్వా తాతల కళ్లలో వెల్లివిరిసిన అనందం

నరసరావుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా అంతటా పింఛన్‌ల పంపిణీ పండుగలా నిర్వహించారు. ఒకే సారి రూ 7 వేలు ఫింఛన్ ఇవ్వడంతో అవ్వా తాతల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. సోమవారం ఉదయం 6 గంటల కల్లా లబ్ధిదారులను నిద్ర లేపిన సిబ్బంది పింఛన్ సొమ్ము వారి చేతిలో పెట్టడంతో అవ్వా తాతల ఆనందానికి అవధుల్లేవు. చెప్పిన మాట సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నాడని పింఛన్ ఒకే సారి వెయ్యి పెంచి రూ.4 ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని చంద్రబాబును లబ్ధిదారులు ఆశ్వీర్వదించారు. ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లో పింఛన్ పంపిణీను వేడుకగా ప్రారంభించారు. నరసరావుపేట నియోజకవర్గంలోని అల్లూరి వారిపాలెంలో కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి పింఛన్ పంపిణీని ప్రారంభించారు. చిలకలూరిపేట మునిసిపాల్టీలోని 7, 9 వార్డుల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అట్టహాసంగా పింఛన్‌ల పంపిణీని ప్రారంభించారు. గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల పట్టణంలో 17 వార్డు నుంచి పింఛన్‌ల పంపిణీని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలసి ప్రారంభించారు. మాచర్ల నియోజకవర్గంలో వెల్దుర్తిలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పింఛన్‌ల పంపిణీని వేడుకగా ప్రారంభించారు. వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పింఛన్ పంపిణీని పండుగలా ప్రారంభించారు. పెదకూరపాడు నియోజకవర్గం లోని అమరావతి మండలం లేమల్లే నుంచి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పింఛన్‌ల పంపిణీని ప్రారంభించారు.



తెనాలిలో పింఛన్ అందుకున్న వృద్ధురాలు



రేపల్లెలో దివ్యాంగురాలికి పింఛన్‌ను అందిస్తున్న మంత్రి అనగాని, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీధర్, ఆర్డీవో హేలా షారోన్



తెనాలి: కఠెవరంలో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



పింఛన్ అందుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు



పింఛన్ అందుకున్న ఆనందంలో వృద్ధురాలు

రుణాల లక్ష్యం రూ.18,369 కోట్లు

నరసరావుపేట, జూలై 1: జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. 18,369 కోట్లు వార్షిక రుణ ప్రణాళికగా నిర్ణయించారు. దీనిలో ప్రాధాన్యతరంగానికి రూ 15,998 రుణ లక్ష్యంగా వెల్లడించారు. వ్యవసాయానికి రూ 13,211కోట్లు, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు రూ 2,224కోట్లు కేటాయించారు. ఇతర ప్రాధాన్యతరంగానికి రూ 563కోట్లు కేటాయించారు. వార్షిక రుణ ప్రణాళికను అధిగమించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జెసీ ఏ శ్యాంప్రసాద్, బ్యాంకర్లు పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ శ్రీకేష్‌లత్కర్, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నరసరావుపేట టౌన్, జూలై 1: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్ మాట్లాడుతూ పట్టణానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వస్తుంటారని ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంతో పాటు ఆర్టీసీ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తుల్ని కాపాడాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉందన్నారు. వారం క్రితం తనిఖీ చేసి ఆక్రమణలను తొలగించాలని సూచించినా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆర్టీసీ స్థలాన్ని అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు లీజుకిచ్చి పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయడంపై సమాధానం చెప్పాలన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న బస్టాండ్‌నే ఆక్రమించుకుంటే అధికారులంతా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులకు రక్షణగా నిలవాల్సిన కర్తవ్యం, బాధ్యత అధికారులదేనన్నారు. తక్షణమే ఆక్రమణలో ఉన్న ఆర్టీసీ ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రజాప్రయోజన అవసరాలకు వినియోగించాలనిసూచించారు.కార్యక్రమంలో కమిషనర్ సి రవిచంద్రారెడ్డి, డీపీటీవో, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లత్కర్, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ కోర్సు

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)-'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి నాలుగు నెలలు. ఈ ప్రోగ్రామ్‌ను ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ఆన్‌లైన్ అసెస్‌మెంట్, అసైన్‌మెంట్, ప్రజంటేషన్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కేస్ స్టడీస్, క్విజ్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్నల్&ఫైనల్ ఎగ్జామినేషన్స్ ఉంటాయి. లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైమ్ యాక్సెస్, కోర్సు మెటీరియల్ ఇస్తారు. ఇండస్ట్రీ లీడర్స్, మిడిల్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, ఫ్రెషర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

కోర్సు వివరాలు

- వారాంతాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం అయిదు వరకు క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ డాక్యుమెంటేషన్ 30 గంటలు, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్స్ 30 గంటలు, కస్టమ్ రెగ్యులేషన్స్ అండ్ ఇంపోర్ట్ ప్రొసీజర్స్ ఆఫ్ ఇండియా 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ 30 గంటలు తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్నల్, ఫైనల్ ఎగ్జామ్స్‌ను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

అర్హత

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** iift.ac.in



జేఎన్‌టీయూఏలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్ (బీటెక్&బీఎస్+ఎంఎస్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి మూడేళ్లు జేఎన్‌టీయూఏ-కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో, చివరి మూడేళ్లు బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది అంటే బీటీహెచ్‌లో ఒక సంవత్సరం చదివిన తరవాత ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి. మిగిలిన రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది. సీఎస్ఈ విభాగంలో 20 సీట్లు, ఈసీఈ విభాగంలో 10 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా 50 శాతం సీట్లను; ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ద్వారా మిగిలిన 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అవేర్‌నెస్ సెషన్‌ను జూలై 20న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. స్వీడన్‌లో ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు

- జేఎన్‌టీయూఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొదటి మూడేళ్లు బీటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్), బీటీహెచ్‌లో నాలుగో ఏడాది బీఎస్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) చదవాల్సి ఉంటుంది.
- బీటీహెచ్‌లో చివరి రెండేళ్ల ఎంఎస్ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ అభ్యర్థులకు కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు; ఈసీఈ అభ్యర్థులకు మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్ ఉంటాయి.

అర్హత

- బీఐఈ(ఏపీ)/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5, మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్; టోఫెల్‌లో అయితే 575/90 స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- పూర్తిచేసిన దరఖాస్తును కింది ఈ-మెయిల్‌కు అప్‌లోడ్ చేయాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 29న
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ అలూమ్నీ మ్యాటర్స్ కార్యాలయం, జేఎన్‌టీయూఏ, అనంతపురం.
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, జేఎన్‌టీయూఏ, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515002
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, dfaam@jntua.ac.in
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ మద్రాస్‌లో ఎంబీఏ- డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్

మద్రాస్‌లోని ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ప్రపంచంలోనే తొలిసారిగా వినూత్నమైన కోర్సు 'డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్'ని అందుబాటులోకి తెచ్చింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సముద్ర వాణిజ్యం, సరఫరా వ్యవస్థ యాజమాన్య పద్ధతుల్లో ఎదురయ్యే సంక్లిష్టతలను అధిగమించేందుకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను ఈ కోర్సు ద్వారా పెంపొందించుకోవచ్చు. రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సును ఐఐటీ మద్రాస్‌కి చెందిన డిపార్ట్‌మెంట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఓషన్ ఇంజనీరింగ్ రూపొందించాయి. తొలి బ్యాచ్ 2024 సెప్టెంబరులో ప్రారంభం కాబోతుంది.

- **ఎంబీఏ ఇన్ డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్**

వ్యవధి: రెండేళ్లు.

ప్రోగ్రామ్ వివరాలు: ఐఓటీ, ఏఐ, ఎంఎల్, బ్లాక్ చెయిన్ వంటి డిజిటల్ టెక్నాలజీపై నైపుణ్యాలు సాధిస్తారు. 900 గంటలు క్లాస్ రూమ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. కోర్సుకి మొత్తం 192 క్రెడిట్స్ నిర్దేశించారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి ఆన్‌లైన్, ఆన్ క్యాంపస్ మాడ్యుల్స్ అందుబాటులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన తరవాత ఐఐటీ మద్రాస్ ఆలూమ్నీ స్టేటస్ కూడా లభిస్తుంది. అదేవిధంగా ఐఐటీ మద్రాస్ ఇన్‌క్యుబేషన్ అండ్ స్టార్టప్ ప్లాట్‌ఫాం ద్వారా ఉద్యోగవకాశాలు పొందే సౌలభ్యం కూడా ఉంది.

అర్హత: అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల పూర్తి స్థాయి(ఫుల్ టైం) పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: వచ్చిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్‌లిస్ట్ చేస్తారు. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

కోర్సు ఫీజు: రూ.9,00,000. వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చు. అర్హులైన వారికి బ్యాంక్ రుణ సదుపాయం కూడా ఉంటుంది.

వెబ్‌సైట్: https://www.iitm.ac.in/



జాబ్ కార్నర్ — హిందుస్థాన్ కాపర్‌లో జూనియర్ మేనేజర్లు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్...వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ మేనేజర్

ఖాళీలు: 56

విభాగాలు: మైనింగ్, ఎలక్ట్రికల్, కంపెనీ సెక్రటరీ, ఫైనాన్స్, హెచ్ఆర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి 40 సంవత్సరాలు మించకూడదు

పే స్కేల్: నెలకు రూ.30,000- రూ.1,20,000

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 21

వెబ్‌సైట్: https://www.hindustancopper.com/

ఎన్ఎఫ్ఎస్‌సీలో బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్)

నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్(ఎన్ ఎఫ్ఎస్‌సీ)- బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024లో అర్హత స్కోర్ ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 4న
- **అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపిణీ:** జూలై 5న
- **అడ్మిషన్స్ తేదీ:** జూలై 29
- **వెబ్‌సైట్:** https://nfscbtechadmissions. com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YFfr14Xలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



మాస్ మూమెంట్స్‌తో 'స్టెప్పామార్'

రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్ అందరికీ మంచి కిక్ ఇచ్చి.. సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను 'మాస్ సాంగ్ ఆఫ్ ది ఇయర్' అంటూ మేకర్స్ విడుదల చేశారు. 'స్టెప్పామార్' అంటూ సాగే ఈ పాట హై ఎనర్జిటిక్ మాస్ మూమెంట్స్‌తో సాగింది. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సాహితీ ఆలపించారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ సాంగ్‌కు మణిశర్మ సంగీతం అందించారు.

సూపర్ నేచురల్ థ్రిల్లర్

వైవిధ్యమైన చిత్రాలతో అందరినీ ఆకట్టుకొంటున్న సుధీర్‌బాబు ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్‌లో నటించనున్నారు. మన పురాణాలతో అనుసంధానం చేస్తూ ఎన్నో రహస్యాలను వెలికి తీసే కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇంతకుముందెన్నడూ రాని డిఫరెంట్ కాన్సెప్ట్‌తో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి వెంట్ కల్యాణ్ దర్శకుడు. 'రుస్తుమ్', 'టాయ్‌లెట్', 'ఏక్ ప్రేమ్ కథ', 'ప్యాడ్‌మ్యాన్', 'పరి' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంటుంది. ఇందులో సుధీర్ బాబు సరసన బాలీవుడ్ కథానాయిక నటిస్తుంది. ఆమె ఎవరనేది త్వరలో తెలియజేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. 'కుట్ర, పన్నాగాలతో మంచికి, చెడుకీ మధ్య జరిగే యుద్ధం ఈ చిత్ర ముఖ్యాంశం. పాన్ ఇండియా సినిమాల్లో ఓ మైల్ స్టోన్‌గా ఉంటుంది' అని చెప్పారు దర్శకుడు కల్యాణ్. ఈ సినిమా గురించి సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ నచ్చి ఏడాది నుంచి ఈ టీమ్‌తో ట్రావెల్ అవుతున్నాను. డిఫరెంట్ కంటెంట్‌తో రూపొందనున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని ఆతృతతో ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. ఆగస్టు 15న ఫస్ట్‌లుక్ విడుదల చేస్తామనీ, సినిమాను శివరాత్రి సందర్భంగా వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేస్తామనీ ప్రేరణ అరోరా చెప్పారు.



మిస్ యూనివర్స్‌తో 'క్యాలెండర్' సాంగ్



కమల్ హాసన్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. ఇది 1996లో రిలీజై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్. టాప్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియన్ మూవీ 12న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. సోమవారం ఈ సినిమా నుంచి 'క్యాలెండర్ లిరికల్ వీడియో'ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో దక్షిణాఫ్రికాకు చెందిన మోడల్, 2017 మిస్ యూనివర్స్ డెమి లీ టెబో నటించి.. పాటకే ప్రత్యేకార్షణగా నిలిచారు. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రావణ భార్గవి ఆలపించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు.

'కోడి బుర్ర' కథ ఏమిటి?



తమిళ హీరో శ్రీరామ్ కొత్త చిత్రం 'కోడి బుర్ర' షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మొదలైంది. శ్రుతి మీనన్, ఆరుషి హీరోయిన్లుగా నటిస్తున్నారు. శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేసిన అనంతరం నిర్మాత బెక్కం వేణుగోపాల్ తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్ ప్రారంభించారు. అనంతరం దర్శకుడు చంద్రశేఖర్ కానూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో శ్రీరామ్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. హీరోయిన్ శ్రుతి మీనన్ డాక్టర్‌గా నటిస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో చిత్రం రూపుదిద్దుకుంటుంది' అని చెప్పారు. ఒక ఇంట్రెస్టింగ్ మూవీలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉందని శ్రీరామ్ చెప్పారు.

యానిమేషన్ చిత్రానికి డాలర్ల పంట



యానిమేషన్ చిత్రం 'ఇన్‌సైడ్ అవుట్ 2' ప్రపంచవ్యాప్తంగా దుమ్ముదులుపుతోంది. చరిత్రలో ఇప్పటివరకూ ఏ యానిమేషన్ చిత్రం సాధించని అరుదైన ఫీట్‌ను నమోదు చేసింది. కేవలం మూడు వారాల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద వన్ బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8500 కోట్లు) ఆర్జించింది. ఇటువంటి సంచలన రికార్డు సాధించడమే కాకుండా ఈ ఏడాది ఇప్పటివరకూ రిలీజైన అన్ని సినిమాల కలెక్షన్లను వెనక్కునెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తానికి వన్ బిలియన్ డాలర్లు కొల్లగొట్టిన 11వ యానిమేషన్ సినిమాగా 'ఇన్‌సైడ్ అవుట్ 2' చరిత్ర సృష్టించింది. ఇండియాలోనూ రిలీజైన ఈ చిత్రం ఇప్పటికే రూ.100 కోట్ల పైచిలుకు కలెక్షన్లను సాధించడం విశేషం. 2015లో ఈ సినిమా మొదటి భాగం 'ఇన్‌సైడ్ అవుట్' జూన్ 19న విడుదలైంది. ఈ చిత్రానికి పీట్ డాక్టర్ దర్శకత్వం వహించారు. 11 ఏళ్ల రిలే ఆండర్సన్ అనే బాలిక మెదడులోని భావోద్వేగాలైన ఆనందం, కోపం, చిరాకు, బాధ, భయం యానిమేషన్ రూపు సంపాదించుకుని.. ఆమె ఆలోచనల్ని, నిర్ణయాల్ని ఎలా ప్రభావితం చేస్తాయి అనేది ఈ సినిమా కథ. ఈ సినిమా లైఫ్‌టైమ్ కలెక్షన్స్ దాదాపు 900 మిలియన్ డాలర్లు (రూ.7500 కోట్లు). ఈ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కింది 'ఇన్‌సైడ్ అవుట్ 2'. జూన్ 14న విడుదలైన ఈ సీక్వెల్‌కు కెల్సీ మన్ దర్శకత్వం వహించారు. దాదాపు 96 నిమిషాల నిడివి కలిగిన ఈ సినిమాను ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ అనుబంధ సంస్థ పిక్సర్ నిర్మించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తన తోటి మిత్రులతో ఐస్ హాకీ ఆడే సమయంలో 13 ఏళ్ల రిలే ఆండర్సన్ జీవితంలోకి ఆందోళన, అసంతృప్తి, సిగ్గు, అసూయ ప్రవేశిస్తాయి. ఆ క్షణం నుంచి సినిమా ఎన్ని మలుపులు తీసుకుందనేది దర్శకుడు చాలా వినోదాత్మకంగా చూపించారు. టీనేజర్లను విపరీతంగా ఆకట్టుకునేలా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రస్తుతం కుటుంబ సమేతంగా ప్రేక్షకులు క్యూ కడుతున్నారు. ఇదే ఊపు కొనసాగితే ఈ సినిమా మరిన్ని రికార్డులు సాధించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

హారర్ మిస్టరీ...



బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా ఓ హారర్ మిస్టరీ సినిమాలో నటిస్తున్నారు. 'చావు కబురు చల్లగా' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్ కొట్టగా, నిర్మాత దిల్‌రాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. సతీశ్ కిలారు, అన్మోల్ శర్మ స్క్రిప్ట్ అందించారు. జూలై 11 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, ఇప్పటివరకూ ఎవ్వరూ తీయని కథాంశంతో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి ఎడిటర్: నిరంజన్ దేవరమానే, డీఓపీ: చిన్మయ్ సలార్కర్, సంగీతం: బి.అజనీశ్ లోక్‌నాథ్.



సునయన పెళ్లి అతనితోనేనా?


'కుమారి వర్సెస్ కుమారి' చిత్రంతో వెండితెర ప్రవేశం చేశారు సునయన. 'రాజరాజచోర' చిత్రంతో హిట్ అందుకుని ఆ తర్వాత కొన్ని సినిమాలు, 'మీట్ క్యూట్', 'ఇన్‌స్పెక్టర్ రిషి' వెబ్ సిరీస్‌లో నటించారు. కొన్ని రోజుల క్రితం తనకు నిశ్చితార్థం అయ్యిందని సోషల్ మీడియాలో ప్రకటించి.. తన కాబోయే భర్త వేలు పట్టుకున్న ఫొటోను షేర్ చేశారు. కానీ తను పెళ్లాడబోయే వ్యక్తి పేరు మాత్రం చెప్పకుండా అందరినీ సస్పెన్స్‌లో పెట్టారు. తాజాగా, ఆమె పెళ్లి చేసుకోబోయేది దుబాయ్‌కు చెందిన ఖలీద్ అల్ అమేరి అనే యూట్యూబర్‌ను అని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి కారణం జూన్ 26న ఖలీద్ అల్ అమేరి తన ఇన్‌స్టా ఖాతాలో ఓ అమ్మాయితో ఉంగరాలు మార్చుకున్న ఫొటోను పోస్ట్ చేశారు. దీంతో సునయన నిశ్చితార్థం చేసుకున్న వ్యక్తి.. పెళ్లి చేసుకోబేయేది ఖలీల్‌నే అని అందరూ అనుకుంటున్నారు. కాగా, ఖలీల్‌కు ఇప్పటికే సలామా మొహమ్మద్‌తో పెళ్లయిందని, ఫిబ్రవరి 14న వారిద్దరూ విడాకులకు అప్లై చేయగా వెంటనే విడాకులు మంజూరు అయ్యాయట. ఈ విషయాన్ని స్వయంగా ఖలీల్ భార్య సలామానే చెప్పారు.



రామ్‌చరణ్ సొంత చిత్రంలో నిఖిల్

వి మెగా పిక్చర్స్ పతాకంపై చిత్రాలు నిర్మించడానికి హీరో రామ్‌చరణ్ నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. యూవీ క్రియేషన్స్ విక్రమ్‌రెడ్డి ప్రొడక్షన్ పార్ట్‌నర్. అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ అగర్వాల్ వీరిద్దరితో చేతులు కలిపారు. నిఖిల్ హీరోగా నిర్మించే తొలి చిత్రం 'ది ఇండియా హౌస్' నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించే ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్ర పోషించనున్నారు. 1905వ సంవత్సరం నేపథ్యంగా ప్రేమ, విప్లవం అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ హంపీలోని విరూపాక్ష దేవాలయంలో ప్రారంభమైంది. మంగళవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుగుతుంది. ఈ చిత్రానికి కెమరూన్ బ్రైసన్ ఛాయాగ్రాహకుడు.

ఐదుగురు స్నేహితుల వినోదం



ఎమ్మెస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల మధ్య జరిగే సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని విస్కి దర్శకత్వంలో బొమ్మా బొరుసా సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు విస్కి మాట్లాడుతూ 'ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ఐదుగురు స్నేహితులకు ఎదురైన అనుభవాలు, వాటి పర్యావసానాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఈ నెల 19న సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/U7EeSaE లో చదవండి.


టీడీపీ కార్యాలయంపై దాడి చేసేందుకు కార్లలో వస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు (ఫైల్)

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో
విచారణ ప్రారంభం

- రెండు రోజులుగా వివరాలు సేకరిస్తున్న పోలీస్ బృందం
- సీసీ కెమెరా ఫుటేజ్‌ల పరిశీలన
- బాధితులను, ప్రత్యక్ష సాక్షులను విచారిస్తున్న పోలీసు అధికారులు
- అజ్ఞాతంలో ప్రధాన నిందితుడు సహా పలువురు కీలక వ్యక్తులు
- నిందితుల్లో అత్యధిక మంది గుంటూరు వాసులే
- వైసీపీ కీలక నేత అనుచరుల ఆధ్వర్యంలోనే దాడి
- పాత్రధారులతోపాటు సూత్రధారులకు కూడా బిగుస్తున్న ఉచ్చు


బాధితులను పరామర్శిస్తున్న చంద్రబాబు (ఫైల్)

గుంటూరు, జూలై 1: తెలుగు దేశం పార్టీ కార్యాలయంపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన ఘటనపై పోలీసులు దృష్టి సారించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌పై జరిగిన దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన విషయం విదితమే. నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంతో 2021 అక్టోబరు 19న టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ అరాచకమూకలు దాడికి తెగబడ్డాయి. వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి, వైసీపీ యువ నాయకుడు దేవినేని అవినాష్‌ల ఆధ్వర్యంలో వారి అనుచరులే ఈ దాడికి పాల్పడినట్లు అప్పట్లో టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో గుంటూరు నుంచి పెద్దసంఖ్యలో అసాంఘిక శక్తులు, రౌడీషీ టర్లు దాడికి తెగబడ్డారని ఆరోపణలు వచ్చాయి. గుంటూరు, మంగళగిరి, విజయవాడ ప్రాంతాలకు చెందిన అసాంఘిక శక్తులు తొలుత వైసీపీ కేంద్ర కార్యాలయం వద్ద సమావేశమై అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలపై మూకుమ్మడిగా టీడీపీ కార్యాలయంపై దాడిచేశారు. ఆ సమయంలో టీడీపీ కార్యాలయ ప్రధానద్వారం గేట్లు మూసిఉండగా బలవంతంగా వాటిని నేలమట్టం చేసి ఒక్కసారిగా కార్యాలయంలోకి చొరబడ్డారు. తొలుత కార్యాలయ అద్దాలు, ఫర్నిచర్, దొరికిన వస్తువును దొరికినట్లు ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టించారు. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అంతేగాక పార్టీ నేతలు అందులో పనిచేసే సిబ్బంది తమ సెల్ ఫోన్లలో ఆయా దృశ్యాలను చిత్రీకరించారు. ఆయా సీసీ కెమెరాలో దాడికి పాల్పడిన అత్యధిక మంది ముఖాలు దాదాపుగా స్పష్టంగా కనిపించాయి. దీంతో వారందరిని గుర్తించేందుకు పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు.

దాడికి నేతృత్వం వహించిన వైసీపీ విద్యార్థి నేత పానుగంటి చైతన్య

గత వైసీపీ ప్రభుత్వంలో గుంటూరులో అన్ని తానే అన్నట్లుగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ప్రధాన అనుచరుడిగా రెచ్చిపోయిన పానుగంటి చైతన్య టీడీపీ కార్యాలయంపై దాడికి నేతృత్వం వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయన ఆధ్వర్యంలో గుంటూరులోని గుజ్జనగుండ్ల, మారుతీనగర్, ఏటి అగ్రహారం, పాతిమానగర్, రామిరెడ్డినగర్, నల్లచెరువు, ఏటుకూరురోడ్డు, పాత గుంటూరు, శ్రీనగర్ తదితర అనేక ప్రాంతాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో ఈ దాడికి తెగబడ్డారు. ముఖ్యంగా ఇందులో పలువురు వైసీపీ కార్పొరేటర్లు, షాడో కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, నగర, జిల్లా వైసీపీ నాయకులు కీలకంగా వ్యవహరించారు. ఇరువురు మహిళా కార్పొరేటర్ల భర్తలు తమ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో యువకులను సమీకరించి ఈ దాడికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పలువురు రౌడీషీటర్లు, మాజీ రౌడీషీటర్‌లు కూడా ఈ దాడిలో పాల్గొనడం కలకలం రేపింది.

చైతన్య సహా పలువురు అజ్ఞాతంలోకి..

అయితే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వారి అంచనాలను మించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాక్‌కు గురైన చైతన్య అదే రోజు నగరం విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయనతో పాటు పలువురు కీలక నాయకులు కూడా అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం చైతన్య బెంగళూరులో తలదాచుకుంటున్నట్లు పోలీస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మరోసారి వైసీపీనే తిరిగి అధికారంలోకి వస్తుందని భావించిన అనేకమంది అసాంఘిక శక్తులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలకు తెగబడ్డారు. ముఖ్యంగా వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడిగా చలామణి అవుతున్న పానుగంటి చైతన్య మరింతగా రెచ్చిపోయారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నుంచి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ వరకు వీరి ఆగడాలు శ్రుతిమించాయి. గత ఎన్నికల పోలింగ్ రోజున భారత్ పేటలోని పోలింగ్ బూత్ వద్ద జేబులో నోట్ల కట్టలతో నిలబడి పోలింగ్‌బూత్‌లోకి వెళ్లేవారికి డబ్బులు ఇస్తూ ప్రలోభాలకు గురిచేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన టీడీపీ అభ్యర్థి భర్తపై పోలీసులతో దాడి చేయించాడు. పోలింగ్ బూత్ వద్ద గొడవకు దిగాడు. గొడవ విషయం తెలుసుకుని ఎంపీ గల్లా జయదేవ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు బూత్ వద్దకు రాగా జయదేవ్ కారు అద్దం పగలగొట్టి ఆయనపై దాడికి యత్నించాడు. అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ బూత్ వద్ద టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్‌పై ఎగబడి తీవ్రస్థాయిలో దూషించాడని కూడా తెలుగుదేశం కార్యకర్తలు వాపోతున్నారు. అంతేగాక జిల్లావ్యాప్తంగా గుట్కా వ్యాపారమంతా ఈయన చేతుల్లోనే జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని రోడ్ల వెంట తోపుడుబండ్ల వ్యాపారుల నుంచి నెలవారి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ప్రధాన జంక్షన్లలో వ్యాపారానికి డిమాండ్ ఉన్నచోట వారిని ఖాళీ చేయించి వేరొకరికి ఇప్పించి పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇవేగాక అనేక అనైతిక కార్యకలాపాలలోనూ ఆయన పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.


దాడిలో ధ్వంసమైన కార్యాలయ అద్దాలు (ఫైల్)

టీడీపీలో చేరతామంటూ చైతన్య సహా పలువురు నేతల రాయబేరాలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో రెచ్చిపోయిన చైతన్య సహా పలువురు షాడో కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, టీడీపీ కార్యాలయంపై దాడి కేసు నిందితులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. ఇంకా తాము వైసీపీలోనే కొనసాగితే తమను టార్గెట్ చేస్తారని, ఆయా కేసుల్లో ఇబ్బందిపడతామని భయపడిన ఆయా నేతలు ఇప్పటికే పార్టీ మారేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే వారు టీడీపీలో వివిధ హోదాల్లో ఉన్న నేతలను సంప్రదించినట్లు తెలుస్తోంది. తాను టీడీపీలో చేరతానంటూ చైతన్య టీడీపీకి చెందిన నేతలను సంప్రదించగా వారినుంచి స్పష్టమైన హామీ లభించలేదని తెలిసింది. గత ప్రభుత్వంలో చైతన్య అరాచకాలతో పాటు టీడీపీ కార్యాలయంపై దాడిలో పాత్రధారిగా ఇప్పటికే తెలుగుదేశం పార్టీ గగ్గోలు పెడుతున్న సమయంలో ఆయనను పార్టీలోకి తీసుకుందామని ప్రతిపాదిస్తే పార్టీ క్యాడర్ రియాక్షన్ తీవ్రంగా ఉంటుందని భయపడి వెనుకంజ వేసినట్లు సమాచారం.


సీఎం చంద్రబాబుని కలిసిన రైల్వే అధికారులు

రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేయాలి

- సీఎం చంద్రబాబు ఆదేశం

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైల్వే అధికారులను ఆదేశించారు. సోమవారం దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌కు సీఎం కార్యాలయం నుంచి పిలుపు రాగా ఆయన గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం రామకృష్ణ, ఇతర అధికారులు, విజయవాడ డివిజన్ అధికారులతో కలిసి ఉండవల్లి సీఎం నివాసానికి వెళ్లారు. సీఎం చంద్రబాబుతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. త్వరలో రాష్ట్ర, కేంద్ర బడ్జెట్ సమావేశాలు జరగనుండటంతో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకొన్నది. సమావేశంలో ప్రధానంగా ఏపీలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. అమరావతి రాజధానికి నూతన రైలుమార్గం, నడికుడి - శ్రీకాళహస్తి, గుంటూరు - గుంతకల్లు రైల్వేడబ్లింగ్, ఆర్‌వోబీ, ఆర్‌యూబీల వంటి వివిధ అంశాలపై చర్చించారు. వచ్చే ఐదేళ్లలో రైల్వే, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. రైలుమార్గాలకు అవసరమైన భూములను సేకరించి ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు సుముఖత వ్యక్తపరిచారని రైల్వేవర్గాలు తెలిపాయి.

పింఛన్ పంపిణీలో సచివాలయ ఉద్యోగి చేతివాటం

- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే జూలకంటి
- విచారించి సస్పెండ్ చేసిన మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు


చేతివాటం ప్రదర్శించిన వాలునాయక్

మాచర్ల రూరల్, జూలై 1: రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో పింఛన్ల పంపిణీ అట్టహాసంగా ప్రారంభమైంది. పింఛన్ల పంపిణీలో అవినీతికి తావు ఉండకూడదని పదే పదే సూచించినప్పటికీ కిందిస్థాయి ఉద్యోగులు తమ చేతివాటం మాత్రం మానుకోలేదు. సోమవారం మాచర్ల పట్టణంలోని 9వ వార్డు ఎరుకల కాలనీలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ మూఢావత్ వాలునాయక్ తన వార్డులో పింఛన్ పంపిణీ చేశారు. ఈ క్రమంలో 27 మంది పింఛన్ లబ్ధిదారుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.500 కట్ చేసి రూ.6500 చొప్పున అందించారు. మరో లబ్ధిదారుని వద్ద వేలిముద్ర తీసుకొని డబ్బులు ఇవ్వకుండానే ఉడాయించాడు. దీనిపై లబ్ధిదారులు టీడీపీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడడమేంటంటూ ఆగ్రహించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు 9వ వార్డుకు చేరుకొని మూఢావత్ వాలునాయక్‌ను విచారించి సస్పెండ్ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న
36 కిలోల వెండి వస్తువుల పట్టివేత

చిలకలూరిపేట, జూలై 1: స్థానిక ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఆదివారం రాత్రి అర్బన్ పోలీసులు అనుమానాస్పదంగా జాతీయ రహదారిపై వెళ్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీలోల 36 కిలోల వెండి వస్తువులు నాలుగు బ్యాగ్‌లలో ఉంచి తరలిస్తున్నట్టు పోలీసులు కనుగొన్నారు. వాటి విలువ సుమారు రూ 23.60 లక్షలు ఉంటుందని అంచనాగా ఉంది. వాటికి సరైన బిల్లులు చూపకపోవటంతో పోలీసులు వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని వాణిజ్య పన్నుల శాఖ అధికారికి అందజేశారు. విజయవాడ నుంచి ఈ వస్తువులను మార్కాపురానికి తరలిస్తున్నట్టు భావిస్తున్నారు. కారులో ఉన్న అర్జున్‌సింగ్, సూర్‌సింగ్, విక్రసింగ్ అనే ముగ్గురు వ్యక్తులు ఈ వెండి వస్తువులను తరలిస్తున్నట్టు అర్బన్ సీఐ పీ రమేష్ సోమవారం తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో ఈ వస్తువులను వాణిజ్య పన్నుల శాఖ అధికారి మల్లిఖార్జున్‌కు అందజేశామని చెప్పారు.

పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ

- జగన్ ప్రభుత్వం రూ.వెయ్యి పెంచడానికి ఐదేళ్లు పట్టింది
- పెన్షన్ పెంచిన ఘనత చంద్రబాబుదే
- రెవెన్యూశాఖలో ప్రక్షాళన
- వేల ఎకరాల ప్రభుత్వ భూమిని అడ్డగోలుగా దోచుకుంది వైసీపీ ప్రభుత్వం
- రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూలై 1: రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా, పింఛన్ నగదు పంపిణీని మంత్రి ప్రారంభించారు. ఉదయం 6గంటల నుంచే ఆయన గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ తక్షణమే అమలు చేస్తూ ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున నగదును అందిస్తున్నామన్నారు. రూ.3వేల నుంచి రూ.4వేలకు పింఛన్ పెంపుదల, గడిచిన మూడు నెలలకు సంబంధించి నెలకు రూ.వెయ్యి చొప్పున రూ.3వేలతో కలిపి రూ.7వేలు అందిస్తున్నామని పింఛన్‌దారులకు అనగాని తెలిపారు. రాష్ట్రంలో 65లక్షల 30వేల మందికి పెన్షన్‌లను అందిస్తున్నామని, ఒక్క రేపల్లె నియోజకవర్గంలోనే రూ.30కోట్లు వివిధ రకాల పెన్షన్‌లను లబ్ధిదారులకు అందించామన్నారు. పేద ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటమే తమ లక్ష్యమని, జగన్ ప్రభుత్వంలో పెన్షన్‌ల విషయంలో పేద ప్రజలు ఎంతో క్షోభకు గురయ్యారన్నారు. పెన్షన్‌ను రూ.వెయ్యికి పెంచేందుకు జగన్‌కు నాలుగు సంవత్సరాలు పట్టిందని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.వెయ్యి ఒక్కసారే పెంచి పింఛన్‌లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని జగన్ పాలనలో అప్పుల ఊబిలోకి దించారని, అన్ని ప్రాంతాలను విచ్ఛిన్నం చేసి ప్రజల మధ్య రాగద్వేషాలను పెంచేలా కుటిల రాజకీయాలు చేశారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో 30సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లిన ఘనత జగన్‌దేనన్నారు. ప్రభుత్వ భూములను జగన్‌అండ్‌కో అడ్డదారిలో తక్కువ ధరకే దోచుకున్నారన్నారు. తవ్వినకొద్ది వైసీపీ ప్రభుత్వం రెవెన్యూ శాఖలో చేసిన అక్రమాలు బయటపడుతున్నాయన్నారు. త్వరలో వీటన్నింటిపై శ్వేత పత్రాన్ని విడుదల చేస్తామన్నారు. అడ్డగోలుగా భూములపై జీవోలు ఇచ్చిన వాటిని చట్టప్రకారం వెనక్కి తీసుకుంటామన్నారు. జగన్ పాలనలో అంతా అవినీతి, అరాచకం జరిగిందని, అధికారుల మెడపై కత్తి పెట్టి అడ్డగోలుగా దోచేసుకున్నారన్నారు. రెవెన్యూశాఖను ప్రక్షాళన చెయ్యనున్నట్లు తెలిపారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని అఖండ మెజార్టీతో గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ముచెయ్యకుండా రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఆర్డీవో హేలా షారోన్, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు పంతాని మురళీధర రావు, అనగాని శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


చిన్నమట్లపూడిలో వృద్ధురాలికి పింఛన్‌ను అందిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

చదువు, అభివృద్ధి సంతోషంగా జరగాల్సిన ప్రక్రియ
విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య


మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), జూలై 1: చదువు, అభివృద్ధి సంతోషంగా జరగాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సోమవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రత్తయ్య మాట్లాడుతూ తమ యూనివర్సిటీలో విద్యార్థులను చేర్పించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పంచసూత్రాల (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ప్లానింగ్, ట్రైనింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్, కౌన్సెలింగ్ సిస్టమ్, సీఆర్‌టీ తరగతులు, బోధన పద్ధతి) వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులందరూ మీ పిల్లలను బాగా ప్రోత్సహించినట్లైతే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారని తెలియజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

జీఎస్టీతో బలమైన ఆర్థికశక్తిగా భారత్

- పన్నుల రంగంలో అతి పెద్ద సంస్కరణ జీఎస్టీనే
- డీఆర్ఎం రామకృష్ణ



ప్రసంగిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ. వేదికపై సీజీఎస్టీ గుంటూరు కమిషనర్ నరసింహారెడ్డి, టుబాకో బోర్డు ఈడీ శ్రీధర్ తదితరులు

గుంటూరు, జూలై 1: గూడ్స్ సర్వీస్ టాక్స్ (జీఎస్టీ)తో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఆవిర్భవించిందని గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ పేర్కొన్నారు. సీజీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి అధ్యక్షతన జీఎస్టీ 8వ వార్షికోత్సవం జీటీ రోడ్డులోని టుబాకో అసోసియేషన్ హాల్లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ పన్నుల రంగంలో అతి పెద్ద సంస్కరణ జీఎస్టీయేనన్నారు. తద్వారా పన్నుల్లో భారీ మార్పులు వచ్చి, పన్నుల వ్యవస్థ పూర్తిగా చక్కబడిందన్నారు. దేశ ఆర్థికవ్యవస్థకు జీఎస్టీతో మంచి ప్రయోజనం చేకూరిందని తెలిపారు. టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలకు ఉత్తరాఖండ్ స్టేట్ నుంచి తాను హాజరైనట్లు తెలిపారు. జీఎస్టీ అనేది వినియోగదారులకు, ఉత్పత్తిదారులకు మేలు చేసేదిగా ఉందన్నారు. స్టేట్, సెంట్రల్ జీఎస్టీ అధికారులు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో జీఎస్టీ వసూళ్ళు ఆర్థికంగా గణనీయమైన వృద్ధిని సాధించాయన్నారు. ఈ సందర్భంగా అత్యధికంగా జీఎస్టీ చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు టాప్ టాక్స్ పేయర్స్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభచూపిన ఉద్యోగులకు, సోషల్ వర్కర్లకు, ఆరోగ్యవీరులకు ప్రశంసాపత్రాలను బహూకరించారు. రాష్ట్రపతి అవార్డు పొందిన ఐఆర్ఎస్ అధికారి, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ వీరవల్లి అంకినీడు ప్రసాద్‌ను ప్రత్యేక ఆహ్వానితులుగా జ్ఞాపికతో సత్కరించారు. అలాగే క్రీడల్లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులు, వారి పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్టీ అడిషనల్ కమిషనర్లు జీ రామకృష్ణరాజుయాదవ్, ఉపేంద్రకుమార్ ధృవ్, అసిస్టెంట్ కమిషనర్‌లు రవికుమార్, నాగరాజు, సీతారామరాజు, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, టీవీజీకే మూర్తి, యుగంధర్, నవీన్‌రాజు, ఈశ్వరరావు, చిట్టి, గద్దె తిలక్, వివేకానంద తదితరులున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- విశాఖలో సాధువుల నుంచి కొనుగోలు
- పొట్లాలు కట్టి ఇక్కడ విక్రయం
- మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం

మంగళగిరి సిటీ, జూలై 1: అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని మంగళగిరి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. మంగళగిరి పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ డి.వినోద్‌కుమార్ నిందితుడి వివరాలను వెల్లడించారు. తాడేపల్లి మార్కెట్ సెంటరు ప్రాంతానికి చెందిన గరిక శ్రీనివాసరావు గంజాయికి బానిసగా మారాడు. చెడు అలవాటునే వృత్తిగా మలుచుకుని గంజాయి విక్రయాలు జరుపుతున్నాడు. విశాఖపట్నం బీచ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ సాధువుల వద్ద కిలోల కొద్దీ గంజాయి తీసుకువచ్చి దానిని చిన్న చిన్న పొట్లాలుగా కట్టి మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం విశాఖపట్నం ఆర్కే బీచ్ వద్దకు వెళ్లి తనకు పరిచయం వున్న సాధువు వద్ద రూ.35వేల విలువైన మూడున్నర కిలోల గంజాయిని కొనుగోలు చేసి మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రి మార్గంలోని చెట్లపొదల్లో దాచాడు. సమాచారం అందుకున్న మంగళగిరి పట్టణ ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా సిబ్బందితో కలిసి దాడి చేసి నిందితుడు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని, మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో పోలీసుసిబ్బంది సీహెచ్ కిరణ్‌కుమార్, ఎ.వేణుగోపాల్, యూఎస్ కిరణ్‌కుమార్, వి.ప్రసాదరావు పాల్గొన్నారు.


గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ వినోద్‌కుమార్

27,904 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 32,157 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 27,904 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 16,461 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16200
నెంబరు. 5	13500	15000
273	--	--
341	8500	16000
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	20000
బ్యాడిగి	8500	15500
తెల్లకాయలు	5000	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17000
నెంబరు 5	9000	9000
273	13500	13500
341	13500	13500
4884	13000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	19500
బ్యాడిగి	9000	16000
దేవనూరుడీలక్స్	13700	13700
తెల్లకాయలు	5000	11500

పల్నాడు వార్తలు



మాచర్ల పట్టణంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

విశ్వసనీయతే మా చిరునామా

- సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యం
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



పాలువాయిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

మాచర్లటౌన్, జూలై 1: కూటమి ప్రభుత్వ హామీల్లో భాగంగా పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నేతలు సమష్టిగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని 13వ వార్డులో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి స్వయంగా లబ్ధిదారులకు పింఛన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వసనీయత, సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యమని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంపుదల చేసి మొత్తం రూ. 7 వేలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లబ్ధిదారుల ఇంటి వద్దకే పంపించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైనప్పటికీ పింఛన్‌లు పొందనివారు వారి వివరాలను అధికారులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే జూలకంటికి వివరించగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మండలంలోని భైరవునిపాడులో పింఛన్ పంపిణీని ఎమ్మెల్యే జూలకంటి ప్రారంభించి ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని జెండా చెట్టు వద్ద మైనార్టీ నేతల ఆధ్వర్యాన ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మాటమీద నిలబడిన ముఖ్యమంత్రి

- ఉప్పుతోళ్ల లక్ష్మి, 18వ వార్డు, మాచర్లటౌన్

ఇచ్చిన మాట మీద నిలబడే నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంపుదల చేసి రూ.7వేల పింఛన్ అందించారు. ఎంతో ఆనందంగా ఉంది. వైసీపీ హయాంలో పింఛన్ రూ.1000 పెంచేందుకు ఐదేళ్లు పట్టింది. ప్రభుత్వ అందించే రూ.4 వేల పింఛన్ ఎంతో ఉపయుక్తంగా ఉంది.



శిరిగిరిపాడులో పింఛన్ పంపిణీ చేస్తున్న శివారెడ్డి

వెల్దుర్తి: మండలంలోని ప్రతి గ్రామంలో పింఛన్ పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం 6 గంటలకు ఎమ్మెల్యే జూలంకటి బ్రహ్మానందరెడ్డి లబ్ధిదారులు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. అలాగే మండాదిలోనూ ఎమ్మెల్యే పింఛన్ అందజేశారు. శిరిగిరిపాడులో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, రాష్ట్రకార్యదర్శి రామాంజిరెడ్డిలు ఆధ్వర్యాన ఎన్టీఆర్, చంద్రబాబు పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. చేసి పింఛన్ పంపిణీ చేశారు. మరసపెంటలో పింఛన్ల పంపిణీలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వృద్ధుల ఆప్యాయత..
భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే..

రెంటచింతల : రెంటచింతల పరిధిలోని అంబేద్కర్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు రూ. రూ.7 వేలు పొందిన వృద్ధులు చూపిన ఆప్యాయతకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. బ్రహ్మారెడ్డి కాలనీలోకి రాగానే పలువురు వృద్ధులు కంటితడి పెట్టి ఎమ్మెల్యేను



వృద్ధులతో ఆప్యాయంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ఆలింగనం చేసుకున్నారు. ఈఘటనతో బ్రహ్మానంద రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. 'మీ కష్టాన్ని వృథా కానివ్వను.. ఏ సమస్య ఎదురైనా నా దృష్టికి తీసుకురండి.. మీకు నేనున్నాను' అంటూ అక్కున చేర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరరావు, సచివాలయ సిబ్బంది, పార్టీ నేతలు తదితరులున్నారు.



దుర్గిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

దుర్గి: మండలంలోని కోలగుట్ల, దుర్గి గ్రామాల్లో సోమవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోలో పొందుపరిచిన రూ.4వేల పింఛన్ పథకాన్ని లబ్ధిదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారంపూడిలో పింఛన్ల పంపిణీ

కారంపూడి: మండలంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేసి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే జూలకంటి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



కారంపూడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



పిడుగురాళ్లలో దివ్యాంగుడికి, వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, జంగా కృష్ణమూర్తి

పింఛన్.. పంచెన్!

- పిడుగురాళ్లలో పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యరపతినేని, జంగా
- వివిధ ప్రాంతాల్లో నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

పిడుగురాళ్ల, జూలై 1: టీడీపీ కూటమి ప్రభుత్వంలో మొదటి నెలలోనే పెంచిన పింఛన్‌ను లబ్ధిదారులకు ఇంటి వద్దనే అందజేశారు. సోమవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పిడుగురాళ్ల పట్టణం, రూరల్ మండల గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకువెళ్లి పింఛన్ నగదు అందజేశారు. పిడుగురాళ్లలో పింఛన్ల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనలో పింఛన్ లబ్ధిదారులకు ఒరిగిందేమీ లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మొదటి నెలనుంచే అన్న మాట ప్రకారం రూ. 4వేలు పింఛన్ అందజేయటం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి రాకముందు చంద్రబాబు ఇచ్చిన మాటను మొదటి నెలలోనే నిలబెట్టుకున్నాడన్నారు. కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్ గిరికుమార్, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, యరపతినేని నిఖిల్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ కూటమి నేతలు పలువురు పాల్గొన్నారు.

టీడీపీ రుణం తీర్చుకోలేనిది

- దాచేపల్లి కృష్ణ, వికలాంగుడు, పిడుగురాళ్ల

కూటమి ప్రభుత్వ పాలనలో వృద్ధులు, వికలాంగులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఇప్పుడు ఏర్పడింది. పింఛన్‌ను పెంచాలని గత ప్రభుత్వ హయాంలో కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకున్న పరిస్థితిలేదు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను మొదటి నెల నుండే పెంచి ఇస్తున్నాడు.

పింఛన్ పెంపు మా అదృష్టం

- నకరికంటి కాశమ్మ, వృద్ధురాలు

గతంలో ఇచ్చిన పింఛన్‌కు రూ.1000 ఒకేసారి పెంచి ఇవ్వడం ఎంతో గొప్ప విషయం. పింఛన్ల పంపిణీలోవున్న ఇబ్బందులను తొలగించి నేరుగా ఇంటివద్దకే కూటమి నేతలు, అధికారులు వచ్చి పింఛన్ నగదును చేతిలో పెట్టడం మా అదృష్టం.

మాచవరం: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. గ్రామాలలో టీడీపీ నేతలు సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. నూటికి 90 శాతం పైనే పంపిణీ జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాత్రి 8.30 గంటల వరకు సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీచేస్తూనే వున్నారు. పలు గ్రామాల్లో ఎన్టీఆర్ చంద్రబాబు, పవన్‌కల్యాణ్, యరపతినేని శ్రీనివాసరావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీడీవో సురేష్, ఈవోఆర్డీ వెంగళరావులు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



దివ్యాంగురాలికి పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి : దాచేపల్లిలోని 10వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభావంతురాలైన కొప్పుల లక్ష్మీ అనే మహిళకు రూ.15వేల నగదును ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు,మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అందజేశారు.



పాత అంబాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నేతలు

గురజాలటౌన్: గురజాల మండల, పట్టణంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీంతో మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. అధికారుల, కూటమి నేతలు పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమినేతలు పాల్గొన్నారు.



మాచవరంలో ఎన్టీఆర్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, యరపతినేని చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

అభివృద్ధి, సక్షేమం రెండు కళ్లుగా..



చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన
- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
- పలు మండలాల్లో పింఛన్ల పంపిణీ

పెదకూరపాడు, జూలై 1 : టీడీపీ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళలాంటివని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రారంభించి దివ్యాంగులు, వృద్ధులు పలువురికి పింఛన్ నగదును అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు రూ.30 కోట్లను వివిధ పింఛన్‌ల కింద పంపిణీ చేసినట్టు వివరించారు. అనంతరం చంద్రబాబు ఫ్లెక్సీకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర, నియోజకవర్గ, మండల నేతలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని బలుసుపాడు, బుచ్చయ్యపాలెం హుస్సేన్ నగరంలో టీడీపీ శ్రేణులు పింఛన్‌లను పంపిణీ చేశారు.



లేమల్లెలో పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి: రూ. 7వేలు పింఛన్ నగదును అందుకున్న లబ్ధిదారులలో ఆనందం కనిపిస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రవీణ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రానున్న రోజులలో పింఛన్ మంజూరు చేస్తామన్నారు. ఎండ్రాయిలో సంగం డైయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, అమరావతిలో టీడీపీ నేతలు, పల్నాడుజిల్లా కాపునాడు అధ్యక్షుడు వెంకటసత్యనారాయణతో పాటు జనసేన పార్టీ నేతలు పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. వీరితో పాటు ప్రతి గ్రామంలో టీడీపీ నేతలు లబ్దిదారులకు పింఛన్లను అందజేశారు.

బెల్లంకొండ: మండల కేంద్రమైన బెల్లంకొండలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని పింఛన్ల పంపినీ కార్యక్రమాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ పార్టీలకు అతీతంగా పింఛన్లను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్‌ను రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బెల్లంకొండలో మహిళకు పింఛన్ పంపిణీ చేస్తున్న ప్రవీణ్



దివ్యాంగ బాలుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే

క్రోసూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం లబ్ధిదారు లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.35తో ఎన్టీ రామారావు పింఛన్లను ప్రారంభిస్తే సీఎం చంద్రబాబు వాటిని ఇప్పుడు రూ.4 వేల వరకు తీసుకువెళ్లారన్నారు. నియోజక వర్గంలోని పెదకూరపాడు, లగడపాడు, అందుకూరు, అచ్చంపేట, క్రోసూరు, అమరావతి గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారం భించామన్నారు. నియోజకవర్గంలోని 5 మండ లాల్లో రూ. 30 కోట్ల పెన్షన్‌లను పంపిణీ చేస్తు న్నట్టు ఆయన తెలిపారు. అనంతరం గ్రామం లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే చంద్రబాబు చిత్రప టానికి క్షీరాభిషేకం చేశారు. వివిధ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల టీడీపీ నేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అచ్చంపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట: సోమవారం పింఛన్‌ల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మండలంలో పలువురి లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి వారికి పింఛన్లను పింపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ దారులు పండుగ చేసుకుంటున్నారన్నారు. మండలంలో 8,984 మంది పింఛన్ దారులకు రూ.6,14,8,500 పింఛన్‌ల పంపిణీ జరిగిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రే స్వయంగా పింఛన్‌లను పంపిణీ చేశారని హర్షం వ్యక్తం చేశారు. ముందుగా టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, జూలై 1: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పలపాడులో నూతనంగా ఏర్పాటు చేయనున్న రహదారి నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన ప్రొక్లెయిన్ నడిపి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని ఉప్పలపాడు నుంచి మండల కేంద్రమైన దుర్గి వరకు 17.6 కి.మీ.లు మేర రూ. 4 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టామన్నారు. అలాగే లోయపల్లి నుంచి లచ్చంబావి వరకు రూ. 34 కోట్లతో అంచనాలు రూపొందించామని తెలిపారు. అలాగే ఉప్పలపాడులోని ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరయ్యాయన్నారు. టెండర్లు పూర్తి చేసుకొని త్వరలోనే పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి, కళ్లం రామాంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, పెళ్లి పేరుతో మోసం..

- న్యాయం చేయాలని బాధిత యువతి వేడుకోలు

నకరికల్లు, జూలై 1 : 'ప్రేమించాడు.. పెళ్లిచేసుకుంటానన్నాడు.. చివరికి తనను అన్నివిధాలా మోసం ఇప్పుడు వేరే యువతితో పెళ్లిపీటలు ఎక్కబోతున్నాడు.. అ విషయంలో నాకు న్యాయం చేయండి' అని ఓ యువతి పోలీసులను ఆశ్రయించిన ఘటన మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి రాహేల్ బాబు అనే వ్యక్తి తనను వివాహం చేసుకుంటానన్నాడు. ఎనిమిదేళ్లుగా ఇలాగే నమ్మిస్తూ వచ్చాడు. తనను అన్నివిధాలా మోసం చేసి చివరికి వేరే యువతితో పెళ్లికి సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న బాధిత యువతి, ఆమె కుటుంబ సభ్యులు రాహేల్ ఇంటికివెళ్లి ప్రశ్నించగా తనను పెళ్ళి చేసుకోనని తెగేసి చెప్పాడు. పైగా తన పెళ్లికి అడ్డువస్తే చంపుతామని బెదిరించారు. తనకు న్యాయం చేయాలని బాధిత యువతి రాహేల్‌బాబు, అతని తల్లిదండ్రులపై పోలీసులను ఆశ్రయించింది. నకరికల్లు ఎస్ఐ కే.నాగేంద్రరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి.. ఆస్తుల ధ్వంసంపై కేసు

సత్తెనపల్లి, జూలై 1 : పట్టణంలోని సనారి వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమ ఆస్తులను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఆస్తులను ధ్వంసం చేసి దాడులకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు. గుంటూరు రోడ్డులోని సనారి వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమానికి చెందిన 2.70 ఎకరాల స్థలంలో 40 సెంట్ల స్థలాన్ని అక్రమంగా పెద్దిరెడ్డి గోవిందరెడ్డి, పెద్దిరెడ్డి మంగమ్మ, దీపిక, అంజిరెడ్డి, మరొక వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆశ్రమ నిర్వాహకులు చింతాడ రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు



గుండ్లపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న మాజీ మేయర్ కన్నా నాగరాజు

- పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల ప్రశంసలు
- వివిధ గ్రామాల్లో అధినేతల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

సత్తెనపల్లి, జూలై 1 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేస్తున్నారని పలువురు టీడీపీ నేతలు అన్నారు. సోమవారం పట్టణంలో, నియోజక వర్గంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, వైసీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామ స్వామి, చౌట శ్రీనివాసరావు, మన్నం శారదాదేవిలు మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పెన్షన్ దారులకు మూడు నెలలకు రూ 7వేలు అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. 8వ వార్డు టీడీపీ నేతలు చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పింఛన్‌ల పెంపు టీడీపీకే సాధ్యం : ఎమ్మెల్యే కన్నా

రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం నారా చంద్రబాబునాయుడు వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లను పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపారని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామి మేరకు పింఛన్ రూ.4 వేలతో పాటు మరో మరో రూ.3 వేలు అదనంగా ఇవ్వటం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. పింఛన్‌లు అందుకున్న లబ్ధిదారులందరికీ కన్నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఎంతో సంతోషంగా ఉంది : చింతల సామ్రాజ్యం, సత్తెనపల్లి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామిని నిలబెట్టుకున్నారు. పెంచిన పింఛన్‌తో కలిపి 3 నెలలు రూ.3 వేలు ఇవ్వటం కూడా తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. పింఛన్ దారులకు కూటమి ప్రభుత్వం ఎంతో మేలు చేసింది.

సత్తెనపల్లి రూరల్: పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అన్ని మండలంలోని గ్రామాల్లో ఉదయం 6 గంటలకే టీడీపీ నేతలు, సచివాలయ సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకలు నిర్వహించారు.

నకరికల్లు : మండలంలోని గుండ్లపల్లి, నకరికల్లు, కండ్లకుంట గ్రామాల్లో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, కుంకలగుంట, జల్లాపేటలలో టీడీపీ నేత కనుమూరి బాజీ చౌదరి, కండ్లకుంటలో రావెల సత్యనారాయణ, చీమలమర్రిలో టీడీపీనేతలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నేతలు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని ఆకులగణపవరం, బలిజేపల్లి తదితర గ్రామాలలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు, గుంటూరు మాజీ మేయర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మన సీఎం చంద్రబాబునాయుడు ప్రతి కుటుంబానికి పెద్ద కుమారుడి పాత్ర పోషిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో జిల్లా పూజల వెంకటకోటయ్య, పల్లపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పెన్షన్‌తో పెరగనున్న జీవన ప్రమాణం

దమ్మువళం సీతమ్మ, కుంకలగుంట, నకరికల్లు మండలం

కూటమి ప్రభుత్వం పెన్షన్‌ను రూ 3వేలు నుంచి రూ 4వేలకు పెంచటంతో మా లాంటి పేదల జీవితాల్లో ఆర్థిక భద్రత పెరిగింది. మా జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి. ఇంత పెన్షన్ వస్తుందని ఊహించ లేదు. ఎంతో సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు ధన్యవాదాలు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞులు.

ముప్పాళ్ళ దేశచరిత్రలో ఇంటికి వెళ్ళి పింఛన్లు పంచిన మొదటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాశ్ నారాయణ అన్నారు. మండలంలోని మాదలలో ఇంటింటికీ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో బాగంగా మాదలలో పింఛన్‌దారులకు అందించారు. ఆయన వెంట నాగేశ్వర రావు, కోటేశ్వరరావు, మధుబాబు పలువురు నాయకులు ఉన్నారు. మండలంలోని గోళ్ళపాడు, లంకెళ కూరపాడులో కన్నా నాగరాజు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ముప్పాళ్ళలో డిప్యూటి తహసీల్దార్ లక్ష్మీప్రసాద్ పింఛన్లను పంపిణీ చేశారు.



మక్కెనలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు



వడ్డవల్లిలో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీ తులసీ



మాదలలో పింఛన్లను పంపిణీ చేస్తున్న నియోజకవర్గ పరిశీలకులు శ్రీరాం తాతా జయప్రకాశ్ నారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

కలిసి పనిచేద్దాం..అభివృద్ధి సాధిద్దాం

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, జూలై 1: 'నేను స్పష్టమైన ప్రణాళికతో వస్తున్నా.. ఎవ్వరూ ఆందోళన పడొద్దు.. అందరికీ అండగా వుంటా.. తగ్గి వుండండి. ప్రతి ఒక్కరిని గౌరవించండి.. కలిసి పనిచేద్దాం.. అభివృద్ధి వైపు ముందుకు సాగుదాం' అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసారవు కార్యకర్తలకు, నాయకులకు తెలిపారు. సోమవారం దాచేపల్లి మండలంలోని కూటమి నాయకుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. మనమంతా కలిసికట్టుగా వుండి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేవిధంగా కృషిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళదామన్నారు. గ్రామాలలో టీడీపీ, జనసేన, బీజేపీతో కలుపుకొని పనిచేయాన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హత్యలు చేసిన వారిపై, దుర్మార్గాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా చూద్దామన్నారు. పార్టీ కోసం కష్టాలు, కేసులు పడినవారికి తగిన న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో యరపతినేని నిఖిల్, తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, వేముల వినోద్‌రెడ్డి, కొప్పుల గిరి, అక్కినపల్లి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ రామ్మోహనరావుకు బ్రెయిన్‌స్ట్రోక్

రెంటచింతల, జూలై 1: రెంటచింతల తహసీల్దార్ ఎస్.రామ్మోహనరావు సోమవారం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. ఒంగోలు నుంచి విధులకు హాజరు కావడానికి రైలులో వస్తుండగా సత్తెనపల్లి వద్దకు రాగానే అనుకోకుండా రైలులో పడిపోయారు. రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో తొలుత సత్తెనపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మూడు గంటలపాటు శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నెల్లూరు జిల్లా దిద్దలూరు మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి.. తహసీల్దార్ రామ్మోహనరావు ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు.

బాలుడి అనుమానాస్పద మృతి

సత్తెనపల్లి, జూలై 1 : పట్టణంలోని తారక రామ సాగర్‌లో బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన సోమవారం బహిర్గతమైంది. 6వ వార్డుకు చెందిన దుర్గా ప్రవీణ్ అతని నలుగురు స్నేహితులతో కలసి ఆదివారం స్థానిక తారకరామసాగర్‌లో ఈత కొట్టేందుకు వెళ్ళారు. గుంజి దుర్గా ప్రవీణ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి తల్లిదండ్రులు రాంబాబు, లక్ష్మీ తిరుపతమ్మ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ప్రవీణ్‌తో పాటు ఈతకు వెళ్ళిన నలుగురు బాలురను పిలిచి విచారించటంతో తారక రామ సాగర్ వద్దకు తీసుకువెళ్ళారు. అక్కడ ప్రవీణ్ మృత దేహాన్ని పోలీసులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రవీణ్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకే పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రవీణ్ మృతి పై కుటుంబ సభ్యులు, బంధువులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీరావు లాట్కర్, ఇతర అధికారులు

ప్రజా ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి

● కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీరావు లాట్కర్

నరసరావుపేట టౌన్, జూలై 1: అధికారులు, ప్రజల కోలాహలం నడుమ సందడిగా ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీ కోసం సోమవారం నరసరావుపేటలోని పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభమైంది. ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీరావు లాట్కర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కే వినాయకం వినతులు స్వీకరించారు. మొత్తం 76ఫిర్యాదు వచ్చాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వాలంటూ ఆందోళన

నరసరావుపేట టౌన్, జూలై 1: సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం నరసరావుపేట పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీరావు లాట్కర్‌కు ఫిర్యాదు చేశారు. సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గత 20 సంవత్సరాలుగా కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నామన్నారు. నెలకు రూ.16వేలు జీతం అని రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారని, అది కూడా వాళ్ళ ఇష్టం వచ్చినప్పుడు ఇస్తున్నారని మిగతా రూ.5వేలు కాజేస్తున్నారని ఆరోపించారు. పీఏఫ్ కట్ చేస్తున్నా పీఏఫ్ ఖాతాలలో జమ అవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారికి అర్జీని పంపుతామని, కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీఎం నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పల్లె వెలుగు బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, జూలై 1: నరసరావుపేట ఆర్టీసీ గ్యారేజ్‌లో సోమవారం నూతన పల్లెవెలుగు బస్సును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ బస్సును నరసరావుపేట, వినుకొండ మధ్య తిప్పనున్నారు. పెన్షన్‌లు పంపిణీ కోసం అదే ఆర్టీసీ బస్సులో డిపో నుంచి స్టేడియం వరకు ప్రయాణం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజని, టీడీపీ మండల అధ్యక్షుడు బండారు విశ్వేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు కాశిం, ఆర్టీసీ ఆర్ఎం, డీఎం, మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడు వెంకట హనుమయ్య అరెస్టు

ఈపూరు, జూలై 1: మండలంలోని ఇనుమెళ్ల గ్రామంలో ఇరువర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి గొడవలు సృష్టించి పలువురు తీవ్రంగా గాయపడడానికి కారణమైన వైసీపీ నాయకుడు గోనుగుంట్ల వెంకటహనుమయ్యను అరెస్టుచేశారు. ఏప్రిల్ 24వ తేదీన జీవీ ఆంజనేయులు నామినేషన్ వేసే రోజు ఇనుమెళ్ల నుంచి టీడీపీ కార్యకర్తలు వినుకొండకు బయలుదేరారు. ఆ సమయంలో వైసీపీ నాయకులు ద్విచక్రవాహనాలకు వైసీపీ జెండాలు పెట్టుకొని కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఆసమయంలో గొడవలు జరగకుండా సర్దిచెప్పి ఇరువర్గాలను పంపించివేశారు. సాయంత్రం నామినేషన్‌కు వెళ్లి వస్తున్న వారికి ద్విచక్రవాహనాలు అడ్డుపెట్టి వారిపై దాడిచేశారు. ప్రశ్నించిన వారిపై వెంకట హనుమయ్య, పిచ్చారావులు వైసీపీ వర్గీయులను రెచ్చగొట్టి కర్రలతో దాడి చేయించారు. దాడులలో చింతల నాగార్జున, సీతారామాంజినేయులు, నాగేశ్వరరావు, ఉడుముల కోటేశ్వరరావు, బుడం చలమయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యశాలలో చికిత్సపొందుతూ పోలీసులకు ఫిర్యాదుచేశారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి వినుకొండ టౌన్ సీఐ సాంబశివరావు ఆధ్వర్యంలో విచారణ జరిపి గోనుగుంట్ల వెంకట హనుమయ్య, పిచ్చారావు ఆధ్వర్యంలో దాడులుచేసి గాయపరిన తమ్మిశెట్టి ఆంజనేయులు, చెవుల సుబ్బారావు, కొడవత్తి రామకోటేశ్వరరావు, కఠారి హనుమయ్య గోపి వెంకట్, చెవుల కబ్బయ్య, కానూరి వీరాంజి, కొల్లి పున్నయ్య, చల్లా వెంకటేష్, లను శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వెంకటహనుమయ్యను ఆదివారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం చేస్తున్న పండితులు

నరసరావుపేట టౌన్, జూలై 1: పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులో ఉన్న గోదా పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి త్రయోదశ 13వ వార్షిక బ్రహ్మోత్సవ వార్షిక కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. దేవత ఆహ్వానం, మంగళాశాసనం, శ్రీవారి కల్యాణం, మహానివేదన, తీర్థప్రసాద వితరణ జరిగింది. మధ్యాహ్నం తదియారాధన అన్నదానం జరిగింది. స్వామివారి గరుడోత్సవాలు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ, ఆయల కమిటీ అధ్యక్షుడు మల్లెపెద్ది సాంబశివరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదురు హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వద్ద ఈకేవైసీ కోసం క్యూలైన్‌లో ఉన్న వినియోగదారులు

ఈకేవైసీ కోసం వినియోగదారుల ఇక్కట్లు

● ప్రధాన రహదారిపై నిత్యం బారులు

వినుకొండ టౌన్, జూలై 1: గ్యాస్ కంపెనీ కార్యాలయాల వద్ద ఈకేవైసీ కోసం లబ్ధిదారులకు నిత్యం కష్టాలు తప్పడం లేదు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందచేస్తామని ప్రకటించడంతో కంపెనీ యజమానులు దీనిని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఈకేవైసీ చేయించుకున్న వారికే 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు వస్తాయని కంపెనీ సిబ్బంది గ్రామాల్లో తప్పుడు ప్రచారం ప్రారంభించారు. నిరుపేదలు నిత్యం పొలం పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, పొలం పనులు పక్కన పెట్టి, మహిళలు కాళ్ళు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సివస్తోంది. ఈకేవైసీ కోసం కార్యాలయాల వద్ద ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు క్యూ లైన్‌లో నిలబడలేక పోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌పీ, భారత్ గ్యాస్ కార్యాలయాలు పట్టణంలో నర్సరావుపేట-గుంటూరు జాతీయ రహదారి పక్కన ఉండడంతో నిత్యం రోడ్డుపై వాహన రాకపోకల తాకిడికి రోడ్లపై క్యూలో నిలబడలేక పోతున్నామని పలువురు వాపోతున్నారు. ఇదిలాఉండగా గ్యాస్ లబ్ధిదారుల నుంచి గ్యాస్‌పైపు పేరుతో బలవంతంగా రూ.200 వసూలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈవిషయంపై గతంలో అధికారులకు ఫిర్యాదుచేసినా, పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు కనీసం తాగడానికి నీరు, తినడానికి తిండిలేక ఈక్రైవైసీ కోసం మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈకేవైసీ పేరుతో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోనే గ్యాస్ పంపిణీ, ఈకేవైసీ చేపట్టాలని గ్యాస్ వినియోగదారులు కోరుతున్నారు.



రొంపిచర్ల ఇండేన్ గ్యాస్ వద్ద క్యూ కట్టిన వినియోగదారులు

రొంపిచర్లలో...

రొంపిచర్ల, జూలై 1: మండలంలోని రొంపిచర్లలో ఇండేన్ గ్యాస్ వద్ద వినియోగదారులు సోమవారం క్యూకట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ వినియోగదారులను ఈకేవైసీ చేయించుకోవాలని పేర్కొనటంతో బారులుతీరారు. కొద్దిరోజుల క్రితం సాధారణంగా గ్యాస్ ఆఫీసులోకి వెళ్లి ఈకేవైసీ చేయించుకున్నారు. ఐతే ప్రజలు అధిక సంఖ్యలో రావటంతో క్యూలైన్ ఏర్పాటుచేశారు.

నెల రోజుల్లోనే హామీల సాకారం

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి



యడ్లపాడులో వృద్ధ మహిళకు పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 1: ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే సాకారం చేస్తున్న మనసున్న మారాజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. సంక్షేమానికి నాంది పలికిన రోజుగా జూలై 1న రాష్ట్ర చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోతుందన్నారు. సోమవారం పట్టణంలోని 7, 9 వార్డుల్లో సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ప్రత్తిపాటి పాల్గొని లబ్ధిదారులందరికీ పెంచిన వెయ్యి, గడిచిన మూడు నెలల మొత్తం కలిపి ఒకేసారి రూ.7వేలు పంపిణీ చేశారు.

● చిలకలూరిపేట, జూలై 1: నియోజకవర్గంలో సోమవారం పింఛన్ల పండుగను వైభవంగా నిర్వహించారు. ప్రతిచోట సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు పాల్గొని ఫెన్షన్‌లను పంపిణీ చేశారు. పలు వార్డుల్లో, గ్రామాల్లో ఫెన్షన్ దారులకు మిఠాయిలు పంచి పెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. మాజీమంత్రి, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు నియోజక వర్గ మంతా తిరిగి తొమ్మిది చోట్ల జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని స్వయంగా పెన్షన్‌లను పంపిణీ చేశారు. పట్టణంలోని 12వ వార్డులోని తూర్పు క్రిష్టియన్‌పేటలో జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు పింఛన్లు పంపిణీ చేశారు. 38వ వార్డులో కౌన్సిలర్ పాములపాటి శివ కుమారి, వార్డు నాయకులు తూబాటి శ్రీహరి చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. 27వ వార్డు పరిధిలో 18వ సచివాలయం జమ్మి చెట్టు వద్ద టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మద్దిబోయిన శివ, 8వ వార్డులో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్త కుమారి, మల్లిబాబు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెల్లంపల్లి రవి శంకర్, కాటన్ రెహ్మాన్ తదితరులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. 10వ వార్డులో కౌన్సిలర్ మౌలాలి, అజారుద్దీన్, జనసేన నాయకులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పసుమర్రులో తెలుగు యువత నాయకులు గరికపాటి ఆదిత్య, దొడ్డా చైతన్య, బాచిన శరత్, కోట సుదర్శన్, మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని పింఛన్లను అందజేశారు. 32వ వార్డులో కౌన్సిలర్ బిట్ర రాజేంద్రప్రసాదు, ఇనగంటి జగదీష్, జంజనం వెంకటేశ్వర్లు, రాములు నాయక్ తదితరులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం: గోనుగుంట్ల

రొంపిచర్ల, జూలై 1: రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారుల్లో ఆనందం నెలకుందని రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో నూతన పింఛన్‌లను ఆయన టీడీపీ నాయకులతో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పులికూరి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, పల్లెల నాగిరెడ్డి, జాష్టి ప్రసాదు, మాదినీడి అంజయ్య, మొండితోక రామారావు, పొనుగోటి వెంకటేశ్వర్లు, గరికపాటి తాతయ్య, హలో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు, జూలై 1: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ప్రతిరోజూ పండుగేనని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని లింగారావుపాలెం, మైదవోలు, యడ్లపాడు గ్రామాలలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

● నాదెండ్ల, జూలై 1: మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్‌ల పంపిణీ సోమవారం కోలాహలంగా జరిగింది. మండలంలోని అప్పాపురం, నాదెండ్ల గ్రామాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని పంపిణీ చేశారు. సోమవారం రాత్రికి సుమారు 94 శాతం వరకు పింఛన్‌ల పంపిణీని చేసినట్లు ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ తెలిపారు.

● యడ్లపాడు, జూలై 1: రాష్ట్రంలోని ప్రతి ఇంటికి పెద్ద కొడుకులా అండగా ఉండడంతోపాటు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని మాజీ జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కుర్రా రత్తయ్య పేర్కొన్నారు. ఉన్నవలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, స్థానిక నాయకులతో కలసి కుర్రా రత్తయ్య పింఛన్లను పంపిణీ చేశారు. బోయపాలెంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కామినేని సాయిబాబు వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులతో కలసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. లింగారావుపాలెంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మురుకుట్ల బుజ్జి, కట్టా శ్రీహరి, కనపర్తి లక్ష్మీప్రసాదు, తోకల రాజేష్, గ్రామపార్టీ అధ్యక్షులు సుధీర్‌లు పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. కారుచోల, వంకాయలపాడు, తిమ్మాపురం, జగ్గాపురం, జాలాది, సందెపూడి, తుర్లపాడు,చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస, కోట, కొండవీడు, కొత్తపాలెం, దింతెనపాడు, కారుచలో గ్రామాలలో స్థానిక టీడీపీ నాయకులు పింఛన్లను పంపిణీ చేశారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు చిత్తశుద్ధితో అమలు

● వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జూలై 1: రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయినా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 65.31లక్షల మందికి 4,408 కోట్ల రూపాయిలు పింఛన్లు అందించిన ఘనత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కిందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని నిరుపేదలు అధికంగా నివాసం ఉండే 12వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు కూటమి నాయకులు జనసేన కొణిజేటి నాగశ్రీను, బీజేపీ నాయకులు మేడమ్ రమేష్, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణితో కలిసి సోమవారం పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఆయూబ్‌ఖాన్, పీ.వీ సురేష్, పత్తి పూర్ణ, కౌన్సిలర్ పులి నాగరాజుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నూజెండ్ల, జూలై 1: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి గ్యారెంటీ ఇస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రం నూజెండ్లలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకటరావు, పార్టీ నాయకులు గంగినేని ఆంజనేయులు, ముండ్రు సుబ్బారావు, లగడపాటి సూరిబాబు, బచ్చు అంజిరెడ్డి, నక్కా బుల్లీశ్వరరెడ్డి, రావుల బుజ్జి, మరిడి సురేష్, జనసేన నాయకుడు రాజబాబు, బీజేపీ నాయకుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం, జూలై 1: మండలంలోని 15గ్రామపంచాయతీల్లో ఎన్టీఆర్ భరోసా ఫించన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల, గ్రామస్థాయి నాయకులు, సచివాలయ ఉద్యోగులు ఉదయం 6గంటలకే గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల తలుపుతట్టి ఫించన్‌లను పంపిణీ చేశారు. కారుమంచిలోని ఎన్టీఆర్ కూడలి వద్ద పింఛనుదారులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. శావల్యాపురం బీసీ కాలనీలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీచేశారు. నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, గ్రామపార్టీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, సీనియర్ నేతలు బొల్లా పేరయ్య, గోపాళం శివప్రసాద్, ఒత్తుల వెంకటేశ్వర్లు, అమృతపూడి కోటయ్య, బోడెపూడి శంకర్, క్రరి పెదఅంజయ్య, డీఎల్‌డీవో మూలె వెంకటరెడ్డి, ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి, పంచాయతీ కార్యదర్శి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ 12వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, అధికారులు

● ఈపూరు: మండలంలో 6537 ఫించన్లు పంపిణీ చేయాల్సి ఉండగా సాయంత్రానికి 96 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఏవీ రంగనాయకులు తెలిపారు. తహసీల్దారు దిలీప్‌కుమార్‌తో కలిసి ఎంపీడీవో కొచ్చెర్ల తండా, ఈపూరు, అంగలూరు, ముప్పాళ్ళ గ్రామాలలో పింఛన్ల పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రావర్ల జగ్గారావు, టీడీపీ మండల నాయకులు ఐనాల కోటేశ్వరరావు, నెల్లూరిశాంతారావు తదితరులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని బొల్లాపల్లి, సంగినీడుపాలెం గ్రామాల్లో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పెంపుపై ర్యాలీలు నిర్వహించారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల అధికారులు, టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, ఆరికట్ల వాసుదేవరెడ్డి, జరపాల గోవిందునాయక్, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, పెంటాల వెంకటేశ్వర్లు, దాసరి కోటేశ్వరరావు, పల్నాటి వెంకటేశ్వర్లు, అర్దలపూడి శ్రీను, అర్దలపూడి వెంకట నారాయణ, బొల్లాపల్లి కోటేశ్వరరావు, షేక్ సుభానీ, శిరిగిరి రామారావు, గూడూరి ఆది నారాయణ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలిచేది టీడీపీనే

ఎమ్మెల్యే అరవిందబాబు



నరసరావుపేట మండలం ఇక్కుర్రులో పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బిలాట్కర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 1: పేదలకు అసలైన సంక్షేమం అందించి అండగా నిలిచేది తెలుగుదేశం మాత్రమేనని మరోసారి రుజువైందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం ఆనందోత్సాహాల మధ్య రూ.7వేల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇళ్లకు వెళ్లి సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని 1,3,5,6,7,9,11 వార్డులలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీమేరకు రూ.7వేలు పింఛను అందించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజని, కె.విజయకుమార్, సచివాలయ సిబ్బంది, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇస్లామ్‌పేట, వెంగళరెడ్డి కాలనీలలో...

నరసరావుపేట టౌన్, జూలై 1: పట్టణంలోని ఇస్లామ్ పేట, వెంగళరెడ్డి కాలనీలలో సోమవారం ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రవి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, మదినా రసూల్, బుడే, సైదా వలి, బడేబాబు, హాజీ కరిముల్లా, దరియా వలి, మదీనా, ఖాజా, గౌస్, మస్తాన్‌వలి, కరీమ్, పీర్ బాషా, సయ్యద్ గౌస్, సుభాని, ఫరాన్, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ పింఛన్లు: కలెక్టర్

నరసరావుపేట రూరల్, జూలై 1: పల్నాడు జిల్లాలో అర్హులైన పేదలందరికి సామాజిక ఫెన్షన్లు అందించడం జరుగుతుందని కలెక్టర్ శ్రీకేష్ బిలాట్కర్ తెలిపారు. నరసరావుపేట మండలం అల్లూరివారిపాలెం, ఇక్కుర్రు గ్రామాలలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. అనంతరం నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో 1,3,5,6,7వ వార్డులలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సరోజిని, మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి, మండల రెవెన్యూ ఆఫీసర్, మున్సిపల్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఈసీ ఎన్‌సీసీ విద్యార్థులకు పతకాలు

నరసరావుపేట రూరల్, జూలై 1: స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బాపట్ల సూర్యలంకలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో జరిగిన 3 జిల్లాల ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో కాడేట్స్ అద్భుతమైన ప్రతిభ కనపరచి వివిధ విభాగాలలో బహుమతులు సాధించారని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా.డి. సునీల్ తెలిపారు. బహుమతులు గెలిచినవారిలో పి.మణికంఠ - రన్నింగ్‌లో గోల్డ్ మెడల్, టి.నరేంద్ర రన్నింగ్‌లో సిల్వర్ మెడల్, గ్రూప్ డాన్స్ బాయ్స్ - ఫస్ట్ ప్లేస్ షీల్డ్, గ్రూప్ డాన్స్ గర్ల్స్ ఫస్ట్ ప్లేస్ షీల్డ్, ఫ్లాగ్ ఏరియాలో మెరిట్ షీల్డ్, క్యాంపు అడ్మినిస్ట్రేషన్‌లో కె.హరీష్, ఎల్. ప్రశాంత్, రామారావులు మెడల్స్ సాధించినవారిలో వున్నారన్నారు. వీరితో పాటు రాష్ట్ర స్థాయి టిఎస్‌సి సెలెక్షన్స్‌కు ఫైరింగ్, మ్యాప్ రీడింగ్‌లో ఆరుగురు కాడేట్స్ ఎంపికయ్యారని కళాశాల ఎన్‌సిసి అధికారి మేడికొండ రాజేష్ బాబు తెలిపారు.

సాంఘికసేవ కార్యక్రమాలు - ఎన్‌సీసీ విద్యార్థుల బాధ్యత అనే నినాదంతో కళాశాల కాడేట్స్ తయారుచేసిన ఫ్లాగ్ ఏరియా క్యాంపులో ప్రత్యేక ఆకర్షణంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రిన్సిపాల్ డా.డి. సునీల్ మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, పోటీ తత్వం, సమయపాలన మొదలయినా పర్సనాలిటీ డెవలప్‌మెంట్ లక్షణాలను పెంచేవిధంగా కృషిచేస్తున్న ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబుని అభినందించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు: జేసీ



రేషన్ సరుకుల పంపిణీ వాహనాన్ని తనిఖీచేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్

నరసరావుపేట రూరల్, జూలై 1: రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సోమవారం ఉదయం నరసరావుపేట టౌన్‌లోని బరంపేట వద్ద మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్‌ను (పౌరసరఫరాల శాఖ సంబంధించి సంచార రేషన్ సరుకుల పంపిణీ వాహనం) ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన కార్డుదారులకు అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తున్న కొలతలను సంబంధిత పరికరాలను సునిశితంగా పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందజేశారు. కార్డుదారులు అందరికీ త్వరితగతిన రేషన్ సరుకులను అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

చిలకలూరిపేట, జూలై 1: పట్టణంలో రెండుచోట్ల జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదా స్కూల్‌లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇందుకు సంబంధించి అవగాహన సదస్సును నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ శ్రీగిరి పెర్సిస్వరూప మాట్లాడుతూ వైద్యవృత్తి ఎంతో గౌరవ ప్రదమైందని, తమ ప్రాణాలను పణంగాపెట్టి, రోగులను ఎల్లవేళ్ళలా కాపాడతారన్నారు. అకడమిక్ డైరెక్టర్ సత్యదీప్తి మాట్లాడుతూ మనదేశ వైద్యుడు బీసీరాయ్ పుట్టిన రోజును జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు.

డాక్టర్ కృష్ణ మోహన్‌కు సత్కారం

జాతీయ వైద్యుల దినోత్సవంలో భాగంగా స్థానిక గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో దంత వైద్యుడు పేర్ని కృష్ణమోహన్‌ను ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ కృష్ణమోహన్ వృత్తిలో నిబద్ధత కలిగిన వైద్యులన్నారు. కార్యక్రమంలో దాసరి చిట్టిబాబు, గేరా యాకోబు, బుల్లిబాబు, దార్ల బుచ్చిబాబు, ధూళిపాళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● పండరీపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వైద్యుల దినోత్సవంలో వైద్యులు ఏపీ సురేష్‌కుమార్, జి.వరలక్ష్మి, ఎం.బలరామకృష్ణ తేజస్వి, ఎన్.మైథిలిరాజిలను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా రోటరీ జిల్లా మాజీ గవర్నర్ టి.రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సీతాలాంబదేవి ప్రతిష్ఠ వార్షికోత్సవం



గణపవరంలో పూజల్లో పాల్గొన్న పుల్లారావు

నాదెండ్ల, జూలై 1 : మండలంలోని గణపవరం గ్రామంలో గల సీతాలాంబదేవి (బొడ్డురాయి) అమ్మవారి ప్రతిష్ఠ 14వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభిషేకాలను నిర్వహించారు. అమ్మవారిని అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తరలి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాదాలను పంపిణీ చేశారు. కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కాగా అమ్మవారిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు భీమవరపు సుబ్బారావు తదితరులు పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని నూతలపాటి శ్రీనివాసరావు, నాగభూషణం, శివకుమార్, నార్నె హరిబాబు, కోయ కృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

యాదవ అన్నదాన సత్రం నిర్మాణానికి కమిటీ ఏర్పాటు

బొందిలిపాలెం (శావల్యాపురం) జూలై 1: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని శ్రీ అడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద నూతనంగా నిర్మించనున్న నందగోపాల యాదవ అన్నదాన సత్రానికి సోమవారం కమిటీని ఏర్పాటు చేశారు. నియోజకవర్గస్థాయిలో యాదవులంతా విచ్చేసి నూతన కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్నదాన కమిటీ అధ్యక్షుడిగా కోలకాని క్రిష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా పొట్టిపాటి శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎలికా శ్రీనివాసరావు, కార్యనిర్వహణ కార్యదర్శిగా పల్లెబోయిన ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా మర్రి దుర్గారావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

వైద్యులకు ఘన సన్మానం

వినుకొండ, జూలై 1: చైతన్య ప్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాతీయ్య వైద్యుల దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ గోగునేని సాంబశివరావుతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి, డాక్టర్ చిన్నపరెడ్డి, ఇన్నారెడ్డి, కుర్రా శ్రీనివాసరావు, కాకాని సురేంద్ర, చంద్ర, డాక్టర్ ఎం.సాంబశివరావులను ఘనంగా సన్మానించి, వైద్య వృత్తిలో వారు చేస్తున్న సేవలను గూర్చి కొనియాడారు.

డెంగీ వ్యాధి నివారణకు చర్యలు

ఈపూరు, జూలై 1: డెంగీ వ్యాధి నివారణ కోసం చర్యలు తీసుకోవడం వలన రక్షణ పొందవచ్చునని ఎంపీడీవో ఏవీ రంగనాయకులు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమాజం భాగస్వామ్యంతో డెంగీ నివారణ చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ రమ్య

శావల్యాపురం, జూలై 1: వర్షాకాలం ప్రారంభమవుతున్నందున సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు స్థానిక పీహెచ్‌సీలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు, డయేరియా నివారణ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పీహెచ్‌సీ నుంచి శావల్యాపురం సెంటర్ వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో డాక్టర్ రమ్య మాట్లాడుతూ ఆగస్టు 30వరకు డయేరియా నివారణ కార్యక్రమాలు, జూలై 30వరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి డయేరియా లక్షణాలున్నవారిని గుర్తించి ఐరన్, జింక్ మాత్రలను పంపిణీ చేయాలని, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని పీహెచ్‌సీకి తరలించాలన్నారు. ఆమెతోపాటు హెల్త్ సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగికి జీవీ సత్కారం

వినుకొండ, జూలై 1: పట్టణంలోని రైల్వే కమర్షియల్ సూపర్‌వైజరుగా ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన చామర్తి భవానీ శంకర్‌ను ఎమ్మెల్యే జీవీ ఆంజినేయులు సోమవారం ఆయన స్వగృహంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ భవానీశంకర్ ఉద్యోగంతో పాటు, రైల్వే కార్మికుల కోసం విశేషంగా కృషిచేశారని, అదేవిధంగా పట్టణంలో మానవ సేవా సంస్థను స్థాపించి కరోనా సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పీవీ సురేష్, షమీమ్, ఆమీర్ జాన్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి

వినుకొండ జూలై 1: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా వినుకొండకు చెందిన ఖజ్జాయం వియజలక్ష్మిని నియమించినట్లు సోమవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని వెన్యూ కన్వెన్షన్ హాల్లో జరిగిన రాష్ట్ర మహిళా నూతన అధ్యక్షురాలు కొప్పురావూరి రజినీతోపాటు, ఉపాధ్యక్షుడిగా వినుకొండకు చెందిన ఖజ్జాయం విజయలక్ష్మిని ఆర్యవైశ్య గౌరవ అధ్యక్షుడు టీజీ వెంకటేష్, మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించినట్లు ఆమె తెలిపారు.